ద్రాక్షారామ పట్టణ చరిత్ర
ఆలయ శాసనాలలో ఆనాటి సమాజం



బొల్లోజు బాబా

ద్రాక్షారామ పట్టణ చరిత్ర- ఆలయ శాసనాలలో ఆనాటి సమాజం

మనవి మాటలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చరిత్రపై నేను మెకంజి కైఫియ్యతులు–తూర్పుగోదావరి జిల్లా (2020), ప్రాచీన పట్టణాలు–తూర్పుగోదావరి జిల్లా (2021) అనే రెండుపుస్తకాలు రాసాను.

ఇటీవల ప్రాచీనపట్టణాలు పుస్తకం నుంచి ద్రాక్షారామ పట్టణ చరిత్ర వ్యాసాన్ని నా ఫేస్ బుక్ వాల్ పై షేర్ చేసినపుడు చాలామంది నాకు కాల్ చేసి అభినందనలు తెలిపారు. వివిధ వాట్సప్ గ్రూపులలో విస్తృతంగా షేర్ అయినట్లు తెలిపారు.   ఈ అంశంపై మరింత సమగ్ర సమాచారం ఒకే చోట ఉంటే బాగుంటుందనిపించింది

'ప్రాచీన పట్టణాలు' పుస్తకంలో **ద్రాక్షారామ పట్టణ చరిత్ర** గురించి వివరించగా,

'మెకంజి కైఫియ్యతులు' పుస్తకంలో **ద్రాక్షారామ ఆలయ శాసనాల ఆధారంగా ఆనాటి సమాజపు లోతైన విశ్లేషణ** ఉంటుంది.

ఈ రెండువ్యాసాలు ఒకే చోట ఉంటాయని ఒక పిడిఎఫ్ గా చేసి ఆర్చైవ్స్ లో ఉంచుతున్నాను. ఆసక్తి కలిగినవారు ఈ ప్రాంత చరిత్రను, శాసనాలలో అభించే ఆనాటి సామాజిక పరిస్థితులను తెలుసుకొంటారని భావిస్తాను.

బొల్లోజు బాబా
1/1/2026

దాక్షారామము

శాసనాలలో దాక్షారామము, దాకరెమి, పెదదాకరెమి, దక్షారామ, జననాథపురం, భీమానాథపురమ్, దక్షతపోవనం, దక్షిణకాశి అనే వివిధ పేర్లతో పిలువబడింది.

ద్రాక్షారామం సమీపంలో ఉన్న పెద్దాపురపాడు వద్దలభించిన ఒక శాసనం ద్వారా – జైన కొకండి పుర్రులో (నేటి కాకినాడ) ఉన్న కొన్ని జైన ఆలయముల నిర్వహణ నిమిత్తం యాపనీయ సంఘానికి చెందిన కనకనంది అనే జైనాచార్యునికి కొంతభూమిని రెండవ విష్ణువర్ధనుడు (క్రీశ. 673–682) దానం ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ శాసనంలోని ఆ జైన ఆలయములు కొకండిపుర్రు (నేటి కాకినాడ), తూరంగు (తూరంగి), కొయ్యూరు (కోవూరు), పొత్తపి, నడిపూర్, ఇందూరు, పర్తిపాక ప్రాంతాలలో ఉన్నట్లు తెలుస్తున్నది. అంటే ఏడవ శతాబ్దంలో ఇక్కడ జైనమత ఉనికి గణనీయంగానే ఉన్నట్లు అర్థమౌతుంది. ద్రాక్షారామానికి పాతిక కిలోమీటర్ల పరిధిలో ఆర్యావటం, గొర్రిపూడి, జగన్నాధగిరి, బోయినపూడి, బిక్కవోలు, జల్లూరు లాంటి ప్రాంతాలలో జైన అవశేషాలు విస్తారంగా నేటికీ లభిస్తున్నాయి. తొమ్మిదో శతాబ్దం వరకూ ద్రాక్షారామ పరిసరప్రాంతాలలో జైన బౌద్ధాలు సర్వత్రా విలసిల్లాయి.

నేడు మనం చూస్తున్న ద్రాక్షారామ భీమేశ్వర ఆలయాన్ని మొదటి చాళుక్య భీముడు కట్టించాడని స్థలపురాణం చెపుతుంది. దీనికి శాసనాధారాలు లేవు. ఇక్కడ లభించే అత్యంత ప్రాచీనమైన శాసనం క్రీశ. 1038 లో రాజరాజ నరేంద్రుని పాలనాకాలంనాటిది.

పన్నెండో శతాబ్దం నాటికి ద్రాక్షారామభీమేశ్వర ఆలయం ఉచ్ఛదశకు చేరుకొంది. ద్రాక్షారామ ఊరు పట్టణంగా మారింది. ద్రాక్షారామంలో నెలకొని ఉన్న భీమేశ్వర ఆలయానికి దేశం నలుమూలలనుంచి భక్తులు వచ్చేవారు. వారి కొరకు అయిదు సత్రాలు ఉండేవి. రాజులు తమ దిగ్విజయాల అనంతరం భీమదేవునికి కానుకలు సమర్పించుకొనేవారు.

ద్రాక్షారామ ఆలయానికి వివిధ కాలాలలో 13 గ్రామాలను దానంగా

ఇవ్వటం జరిగింది. 12–14 శతాబ్దాలలో వేల ఎకరాల పంటభూమిని, ఫలపుష్ప తోటలను ఆలయనిర్వహణకొరకు భక్తులు దానమొసగారు. 11–14 శతాబ్దాల మధ్య సుమారు పన్నెండువేల పాడి పశువులను భీమేశ్వరునికి భక్తులు అఖండదీప నిర్వహణకొరకు దానంగా సమర్పించుకొన్నట్లు శాసనాలలో ఉంది. ఇది కాక నేరుగా బంగారు నాణాలు, ఆభరణాలు సమర్పించుకొనేవారు. ఒకరకంగా ఆలయాలు ఆనాటి సమాజపు మనీ సర్క్యులేటింగ్ వ్యవస్థలుగా పనిచేసేవి. ఈ మొత్తం వ్యవస్థను సమన్వయపరుస్తూ ఆనాటి ద్రాక్షారామం ఒక మహా పట్టణం స్థాయిని కలిగిఉండేది. అందమైన భవనాలతోను, పెద్దపెద్ద అంగళ్లతోను, వేశ్యావాటికలతోను ద్రాక్షారామ పట్టణం ఉందని శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో వర్ణించబడింది. శ్రీనాథుడు ద్రాక్షారామంలో కొంతకాలం నివసించాడు. ఇతను వ్రాసిన భీమఖండంలో ద్రాక్షారామ పరిసరప్రాంతాలలోని మరికొన్ని క్షేత్రాలను ఇలా ప్రస్తావించాడు.[21]

అదె సంవేద్యము; కోటిపల్లి యదె; దక్షారామ మను పట్టణం
బదె; యభ్రంకషసౌధకూటమున హేలావాస ముచ్ఛ్రాయ సం
పద సొమ్పారెడు భీమలింగము మహాప్రాసాద భూమీధరం
బిదె; సప్తర్షి నదీ ప్రవాహమిదె; సంవీక్షింపు మేకాగ్రతన్ (భీమపురాణం)

(తాత్పర్యం: అదే బ్రహ్మ సంవేద్యం (భైరవపాలెం లోని భైరవేశ్వరుడు), కోటిపల్లి, దక్షారామ పట్టణం, ఆకాశాన్నంటే సౌధాలతో, గొప్పసంపదలతో అలరారే భీమలింగని నివాసం, సప్తగోదావరి ప్రవాహం అదే – జాగ్రత్తగా చూడు)

అదె పట్టిస స్థాన మందుండు వీరభద్రేశ్వర స్వామి యర్థేందు మౌళి
యదె పుండరీకాద్రి యచట మార్కండేయు,నిలువేల్పు ముక్కంటి వెలసె దొల్లి
యదె కుమారరామ మహర్ఘ్యరేఖయ, చాళుక్యభీమేశు సదనవాటి
యదె కుక్కుటేశ్వరం బయ్యుపాంతము మేడ, హుంకారిణీదేవి యోలగంబు
వాడె మాయింటివేల్పు పల్వలపురమున నుందులింగంబుఫణిరాజ కుండలుండు
సప్తముని సింధు సంగమేశ్వరుడు వాడే, కుండలాముఖమదె మౌని కులవరేణ్య
(భీమపురాణం)

తాత్పర్యం: పట్టిసంలో నెలకొన్న వీరభద్రేశ్వరుడు, పుండరీకాద్రిలో మార్కండేయుడు (రాజమహేంద్రవరం), సామర్లకోట చాళుక్యభీమేశుడు, పిఠాపురంలోని కుక్కుటేశుడు, హుంకారిణీ శక్తిపీఠం, పలివెల కొప్పులింగేశ్వరుడు,

---

21. ద్రాక్షారామ క్షేత్ర సాహిత్య సమీక్ష – పరిశోధనాగ్రంధం డా. ఎస్.వి రాఘవేంద్రరావు.

సప్తముని సంగమేశ్వరుడు (ఏడిద గ్రామం)

శ్రీనాథుడు భీమఖండంలో ద్రాక్షారామపురం గురించి చేసిన కొన్ని వర్ణనల అర్ధాలను ఆధ్యాత్మికంగా కాక "మెటఫరికల్ గా" అన్వయించుకొంటే ఆనాటి సమాజిక, ఆర్ధిక పరిస్థితులు మన కళ్లముందు నిలుస్తాయి.

దాక్షారామంలో వాయుదేవుని భార్య ఇల్లూవాకిలి తుడుస్తుందని (ధారాళంగా గాలులు వీచే పట్టణం); ఆ తుడిచిన స్థలాల్లో లక్ష్మీదేవి కళ్ళాపు జల్లుతుందని (అందరూ సంపదలతో తులతూగుతున్నారని); గంగానది ముగ్గులుపెడుతుందని (పుష్కలమైన జలవనరులు ఉన్నాయని); సప్తపాతాళాల్లో నివసించే కాంతలందరూ మణికాంతులతో స్వయంగాపెట్టిన దీపస్తంభాలు అవుతారని (రాత్రిపూట కూడా ప్రకాశవంతమైన దీపకాంతులతో దక్షారామం ప్రకాశిస్తుందని లేదా రాత్రిపూట అందమైన వారాంగనలు బయటకు వచ్చి మణులవలె మెరుపులు చిమ్ముతారని కూడా అర్ధం చెప్పుకోవచ్చు. అప్పట్లో వేశ్యావృత్తి చట్టసమ్మతం); ఇచ్చట మహాత్ములైన తపశ్శాలురు ఎందరో ధ్యానంలో ఆసక్తికలవారై ముక్తికోసం నివసిస్తారని (ఒక ఆధ్యాత్మిక కేంద్రం); ఆయుధధారులైన నందీశ్వరుడు మొదలైన గుణశ్రేష్టులు ఎలా పార్వతిని రక్షిస్తూ ఉంటారో అలా కావలివారు దక్షావాటికలో అర్ధరాత్రి సమయాల్లో గస్తీ తిరుగుతూ ఉంటారు; (ఆనాటి దక్షారామంలో రాత్రివేళల గస్తీలు, లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉండేదని); ఇక్కడి ముగ్ధస్త్రీలు రాత్రుల్లో మణులతో కూడిన మేడల అగ్రభాగాలనుండి నక్షత్రాల్ని ముత్యాలేవో అని పట్టుకొంటూవుంటారనీ అది చూసి వారి భర్తలు నవ్వుతూ ఉంటారని (ఆకాశాన్నంటే మేడలు ఉండేవని, రాత్రివేళల స్త్రీపురుషులు సంతోషంగా ఉండేవారని); ఏలానదీ తీరంలో అన్నిపంటలూ విశేషంగా పండుతూ వుండటం వల్ల పర్వతాల్లా మిక్కిలి ఎత్తైన అనేక ధాన్యరాసులు కన్నులపండుగ చేస్తూ వుంటాయని (ఆనాటి వ్యవసాయ స్థితిగతులు); ఉత్సవ సమయాల్లో ప్రకాశించే వస్తువులతో నిండివుండే విఫణివీధులు, మ్రోగే శంఖాలు, భేరీలు, మద్దెలల మొదలైన వాద్యాల ధ్వనులు సర్వ పాపాల్ని నశింపచేస్తాయి (సామాజిక వినోదం, వ్యాపారం)

ఒకనాటి ద్రాక్షారామ పట్టణం ఎలా ఉండేదో ద్రాక్షారామ ఆలయ శాసనాల ద్వారా కొంతమేరకు కల్పన చేయవచ్చు. ద్రాక్షారామ ఆలయము, చుట్టుపక్కల చేసిన నిర్మాణాలను అనేక శాసనాలు ప్రస్తావిస్తాయి. చోడమండపము, నాట్యమండపము, హోమ మండపము, కులోత్తుంగ చోడ సత్రము, పడుమటి

సత్రము, మేడ మఠము, ఏఉ మఠము, సింగ్గలభణ్డారక పెట్టిన మఠము, తిరివిడి మఠము లాంటి అనేక సామాజిక నిర్మాణాలు ఉండటాన్ని బట్టి అప్పటి ద్రాక్షారామం దూరప్రాంతాల వ్యక్తుల రాకపోకలకు తగినరీతిగా వసతిని కలిగి ఉండేదని అనుకోవచ్చు. ఈ శాసనాలలో ప్రస్తావించబడిన– తెలుగరి సెట్టి, సమస్త పెక్కణ్డు, కాంపులు, పంచానము వారు, నానాదేశి పెక్కణ్డు, కమ్మకోమటి, దకరేమి కోమట్లు, బలంజ ధర్మ ప్రతిపాలక వంటి వాణిజ్య వర్గాలు/సంఘాలను బట్టి ద్రాక్షారామం ఒకప్పుడు బలమైన వర్తక వాణిజ్యాలు జరిపిన పట్టణం అని తెలుస్తుంది.

పదిహేనో శతాబ్దం వచ్చేసరికి రాజకీయకారణాల వల్ల Temple patronage తగ్గిపోయింది. 12 వ శతాబ్దంలో ఆలయానికి అఖండదీపారాధన కొరకు అవసరపడే నేయి నిమిత్తం 9470 ఆవులను దానం ఇవ్వగా, 15 వ శతాబ్దంలో ఆ సంఖ్య 55 గా ఉండటమే ఆలయపోషణ తగ్గిపోయిందనటానికి స్పష్టమైన ఆధారం. క్రమేపీ ద్రాక్షారామ పట్టణం కూడా తన వైభవాన్ని చాలామేరకు కోల్పోయింది. ద్రాక్షారామ గ్రామంలో ఉన్న పురాతన మసీదు మక్కామసీదుకు నమూనాగా నిర్మించబడిన మసీదు అంటారు. ద్రాక్షారామంపై ముస్లిములదాడులకు గురయినట్లు ఏ రకమైన చారిత్రక ఆధారాలు లభించవు.

శ్రీకాకుళం నుండి మచిలీపట్నం వరకూ కల కోస్తాంధ్రాను నిజాం నవాబు 1753 లో ఫ్రెంచి వారికి దఖలు పరిచాడు. వీటిని స్వాధీనం చేసుకోవటానికి ఫ్రెంచి సేనాని బుస్సి, మొరాసిన్ లు వచ్చినప్పుడు ఆనాటి శ్రీకాకుళం సుబేదారు జాఫర్ అలిఖాను ఎదురుతిరిగాడు. ఈ ప్రాంతాలను ఫ్రెంచివారికి అప్పగించటానికి నిరాకరించాడు. ఫ్రెంచివారిని భయభ్రాంతులు చేయటానికి నాగపూర్ నుంచి మరాతా బందిపోటుదొంగలను ఆహ్వానించి వారిని ఫ్రెంచివారిపై ఉసిగొల్పాడు. వీరు గోదావరి జిల్లాలలో మెరుపులా ప్రవేశించి భీభత్సం సృష్టించి అందినంతమేరకు దోచుకొని వెళ్లిపోయారు. ఈ సమయంలో వీరు ద్రాక్షారామ ఆలయంలోకి ప్రవేశించి గుప్తనిధుల కొరకు నంది, హనుమంతుని విగ్రహాలను ధ్వంసం చేసారు.[22]

ద్రాక్షారామం ముస్లిములకు కూడా పవిత్రమైనదేనని ఒక స్థానిక గాథ కలదు. పదహారవ శతాబ్దంలో నాగూర్ మీరాసాహెబ్ సమకాలీనుడైన సయ్యద్ షా బాజి ఔలియ అనే ఒక యోగిపుంగవుడు కొంతమంది శిష్యులతో ద్రాక్షారామం వచ్చాడట. ఈయన మదినాలో జన్మించాడట. ఒకరోజు ఇతని శిష్యులు క్షుద్భాధతాళలేక ఒక శైవమతానికి చెందిన ఎద్దును వధించి తిన్నారట. దీనికి

22. Madras District Gazetteers Godavari, Hemingway FR, p.no 251

ఆగ్రహించిన శివభక్తులు ఈ ముస్లిం గురుశిష్య బృందంతో వాగ్వివాదానికి దిగి, మేము శివలింగాలను ఒక చెరువులోకి ఉంచుతాము నీ మంత్రశక్తితో వాటిని పైకి రప్పించమని ఆ ముస్లిం యోగికి పరీక్ష పెట్టారట. ఆ ముస్లిం యోగి తన తపోమహిమతో చెరువులో వారు ఉంచిన శివలింగాలను అన్నింటిని పైకి రప్పించటంతో – ఆ శివభక్తులు సంతసించి తమ మఠంలో ఆ ముస్లిం యోగి నివసించటానికి అనుమతించారట. అది కాలక్రమేణా మసీదుగా మారిందని కథనం. ఈ గాథ నిజంగా జరిగిందో లేదో తెలియదు కానీ, ఈ గాథ పుట్టుకలో మన పూర్వీకుల హిందూముస్లిం సహిష్ణుతా భావనలు ద్యోతకమౌతాయి.

లీలావతీ పరిణయం కావ్యంలో ద్రాక్షారామం: ఎనిమిదో శతాబ్దానికి చెందిన కౌహలుడు అనే జైన ప్రాకృత కవి, శాతవాహన చక్రవర్తి హాలుడిని ప్రధానపాత్రగా తీసుకొని లీలావతి (లీలావాయి) అనే కావ్యాన్ని రచించాడు. దీనిలో– హాలుని వద్ద సేనానిగా పనిచేస్తున్న విజయానందుడు, మంత్రి పొట్టిసలు ఒకరోజు ప్రతిష్ఠానపురం నుంచి బయలుదేరి పాండ్యరాజ్యం మీదుగా ధనుష్కోటి చేరుకొని రామేశ్వరాలయంలో పూజలు చేసి తిరిగి బయలు దేరేసమయానికి వీరు ప్రయాణిస్తున్న ఓడ పెద్ద తుఫానులో చిక్కుకొంటుంది. వీరు ఆ తుఫానులో కొట్టుకుపోయి గోదావరి నది సముద్రంలో కలిసేచోట ఒడ్డుకు చేరుకొంటారు. అక్కడనుంచి వారు అడవిలో కొద్దిసేపు ప్రయాణించి ద్రాక్షారామ సప్తగోదావరి భీమేశ్వర దేవుని ఆలయానికి[23] చేరుకొని, దైవ దర్శనం చేసుకొని దానికి దక్షిణం వైపు ఉన్న ఒక మఠంలో బస చేస్తారు. అక్కడ వీరు హాలుని పెండ్లాడాలని బయలుదేరిన సింహళ దేశ రాకుమారి అయిన లీలావతిని కలుస్తారు.

ఈ విషయాలన్నీ ప్రతిష్ఠానపురం వెళ్ళి హాలునికి చెప్పగా, హాలుడు బయలుదేరి సప్తగోదావరీ తీరానకల భీమేశ్వర ఆలయానికి వచ్చి సింహళరాకుమార్తె లీలావతిని భీమేశ్వర స్వామి సన్నిధిలో పరిణయమాడటంతో కావ్యం ముగుస్తుంది.

ఈ కావ్యకథనం యొక్క చారిత్రికతను నిర్ధారించే ఆధారాలు నేడు లభించవు. ఎనిమిదోశతాబ్దానికే దాక్షారామం భీమేశ్వరుని ఆలయంగా ఉండేదా అనేది కూడా శోధించవలసిన విషయమే.

నేడు ద్రాక్షారామం ఊరుపరంగా పట్టణం కాకపోవచ్చుకానీ ఆధ్యాత్మికపరంగా. పంచారామాల్లో ఒకటిగా, దేశవ్యాప్తంగా దక్షిణకాశిగా గొప్ప పేర్గాంచిన హైందవక్షేత్రం.

23. Lilavai of Kouhala by A N Upadhye, Pno 60 and 75

ద్రాక్షారామ శాసనాలలో ఆనాటి సమాజం

మూడు శివాలయాలైన శ్రీశైలం, ద్రాక్షారామం, కాళేశ్వరం మధ్యనున్న ప్రాంతం భౌగోళికంగా త్రిలింగదేశంగా పిలువబడింది. క్రీశ. 150 లో టొలెమీ గంగకు దిగువన ఉన్నప్రాంతాన్ని త్రిలింగ అని పేర్కొన్నాడు. టోలమీ తరువాత త్రిలింగ అనే మాట ఆ తరువాత ఏడోశతాబ్దం వరకూ కనిపించదు. క్రీశ.631లో ఇంద్రవర్మన్ అనే రాజు– త్రిలింగదేశ నివాసి అయిన భావదత్తశర్మకు చేసిన ఒక దానశాసనంలో మరలా త్రిలింగ అనే పదం కనిపిస్తుంది[2]. క్రీశ.రెండో శతాబ్ద టోలెమీ కాలంనుంచీ, ద్రాక్షారామ భీమేశ్వర ఆలయం ఉందా అంటే స్పష్టమైన ఆధారాలు కనిపించవు.

****

ద్రాక్షారామము సమీపంలోకల పెద్దాపురపాడు వద్దలభించిన ఒక శాసనంద్వారా– జైన కొకండిపత్రులో (నేటి కాకినాడ) ఉన్న కొన్ని జైన ఆలయముల నిర్వహణ నిమిత్తం కనకనంది అనే జైనాచార్యునికి కొంతభూమిని రెండవ విష్ణువర్ధనుడు (క్రీశ.673–682) దానం ఇచ్చినట్లు తెలుస్తుంది. ఏడవ శతాబ్దంలో ఈ ప్రాంతములో "యాపనీయ సంఘం" (జైనులలో ఒక శాఖ) ఉన్నట్లు కూడా ఈ శాసనంలో ఉన్నది[3]. తొమ్మిదో శతాబ్దం వరకూ తూర్పుగోదావరి జిల్లాలో బౌద్ధ జైనాలు సర్వత్రా విలసిల్లాయి. ద్రాక్షారామంకు పాతిక కిలోమీటర్ల పరిధిలో ఆర్యావటం, గొర్రిపూడి, జగన్నాధగిరి, బోయినపూడి, బిక్కవోలు, జల్లూరు లాంటి ప్రాంతాలలో జైన అవశేషాలు నేటికీ గమనించవచ్చు.

పంచారామాలలో నెలకొని ఉన్న శివలింగం పొడవుగా స్తూపాకారంలో బౌద్ధచైత్యాలలో "ఆయకస్తంభాన్ని" పోలి ఉంటుంది అంతేకాక నేడు పంచారామాలు ఉన్న స్థలాలు చరిత్రలో బౌద్ధం పరిఢవిల్లిన ప్రాంతాలు కనుక ఈ పంచారామాలు ఒకప్పటి బౌద్ధారామాలు కావొచ్చునని శ్రీ ఎన్. రమేశన్ ఇంకా ఇతర చరిత్రకారులు అభిప్రాయపడ్డారు[4]. శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు అమరారామం గురించి వ్రాస్తూ– "మూలవిరాట్టు మీదుగా పాలరాతిమీద చెక్కిన పద్మం

2. R.Suba Rao, JAHRS,Vol.VI,p.79

3. Bharathi, October 1983 & May1985;Jawaharlal G. Jainism in Andhra, p.28

4. Religion in Andhra, BSL Hanumantha Rao p.130

కానవస్తుంది. పరమ సుకుమారమైన ఆ శిల్పశైలి ప్రాచీన బౌద్ధానికి సంబంధించినదే. లింగం ఎత్తు సుమారు 15 అడుగులు. పూర్వం ఇది ఆయక స్తంభమనీ, తరువాత శివలింగంగా ప్రతిష్ఠితమై పూజింపబడుతోందని ఒక వదంతి వుంది" అంటారు[5].

బాపట్ల భావనారాయణ స్వామి ఆలయ పశ్చిమగోడపై క్రీశ 1149 నాటి ఒక శాసనంలో – "భీమాపురము(సామర్లకోట) డాకరేమి (ద్రాక్షారామం) వాల్కొలను (పాలకొల్లు) దచ్యారామపురి (భీమవరం) ఆంధ్రధరణి (అమరావతి) పంచారామములలో ఈశ్వరునికి, బుద్ధదేవరకును అఖండదీపములు పెట్టబడ్డాయి" అని స్పష్టంగా ఉన్నది[6]. ఆ తరువాతి శాసనాలలో బుద్ధుని ప్రసక్తి లేదు. పై శాసనమునుబట్టి పంచారామములలో బుద్ధదేవుడు ప్రాచీనదైవం అని అర్థమౌతుంది[7]. నేటికి దక్షారామంలో భీమేశ్వరాలయం మీదిభాగాన భీమేశ్వర మందిరం చుట్టూ ప్రదక్షిణం చేసేచోట ఓ స్తంభానికి ఒక బుద్ధ విగ్రహం ఉంది. అర్చకులు దీనిని "ఆర్ష బుద్ధుడు" అంటారు.

ఏదిఏమైనప్పటికీ ద్రాక్షారామం ఒకప్పుడు బౌద్ధారామంగా ఉండేదా లేక జైనాలయమా అనేప్రశ్నకు స్పష్టమైన ఆధారాలు లభించవు. ద్రాక్షారామం శైవక్షేత్రంగా మారకముందు ఈ ప్రాంతం బౌద్ధజైనాలకు ఆలవాలంగా ఉండేదని సర్వత్రా ఆమోదించిన విషయం.

****

నేడు మనం చూస్తున్న ద్రాక్షారామ భీమేశ్వర ఆలయాన్ని తూర్పుచాళక్య భీముడు I (క్రీశ.892-922) కట్టించాడని స్థలపురాణం చెపుతుంది. దీనికి తగిన శాసనాధారాలు లభించవు. సామర్లకోటలో ఉన్న కుమార భీమేశ్వరాలయాన్ని చాళుక్య భీముడు నిర్మించాడని పిఠాపురంలోని ఒక శాసనం ద్వారా తెలుస్తున్నది[8]. ఈ రెండు ఆలయాల నిర్మాణానికి ఉపయోగించిన రాయి కూడా ఒకేరకమైనదిగా, నిర్మాణశైలికూడా ఒకే ఉండటం గమనార్హం. చాళుక్యభీముడు ద్రాక్షారామ

---

5. తెలుగునాట దేవాలయాలు, శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి
6. South Indian Inscriptions vol 6, No 133, P.no 68
7. ద్రాక్షారామ క్షేత్ర సాహిత్య చరిత్ర పరిశోధనా సిద్ధాంతము, యస్ వి. రాఘవేంద్రరావు, తెలుగు విశ్వవిద్యాలయము.
8. Epigraphica Indica vol XIX p 165

ఆలయాన్ని నిర్మించాడన్న విషయాన్ని నిర్ధారించటానికి చాళుక్య భీముని కాలానికి చెందినవి కాదుకదా అతని పాలన ముగిసిన యాభైఏండ్లవరకూ కూడా ఏరకమైన శాసనాలు ద్రాక్షారామ ఆలయములో లభించవు. అక్కడ లభించే అత్యంత ప్రాచీనమైన శాసనం క్రీశ. 1038 లో రాజరాజ నరేంద్రుని పాలనాకాలంలో చేసిన దానాలను గురించి ఉన్న ఒక శాసనము[9]

పన్నెండో శతాబ్దం నాటికి ఈ ఆలయం ఉచ్ఛదశకు చేరుకొంది. ఆలయానికి చేర్చి భక్తులకొరకు అయిదు సత్రాలు నడిచేవి. అనేక దానాలు ఇవ్వబడినట్లు తెలుస్తుంది. ఆలయప్రాంగణంలో అనేక మండపాల నిర్మాణాలు జరిగాయి.

పదవశతాబ్దం నుండి పదహారోశతాబ్దం మధ్యలో వేంగిచాళుక్యులు, చోళులు, వెలనాటి చోళులు, రెడ్డిరాజులు, విజయనగర రాజులు వేయించిన శాసనాలు ద్రాక్షారామ ఆలయంలో ఎక్కువగా కనిపిస్తాయి. ఈ ప్రాంతానికి ముస్లిముల రాక పద్నాలుగో శతాబ్దం నాటికే మొదలైనా, ద్రాక్షారామ ఆలయం ముస్లిముల దాడులకు గురయినట్లు ఆధారాలు ఎక్కడా శాసనాలలో లిఖించ బడలేదు. ద్రాక్షారామ గ్రామంలో ఉన్న పురాతన మసీదు మక్కామసీదుకు నమూనాగా నిర్మించబడిన మసీదు అంటారు[10].

ఆనాటి ఆంధ్రదేశం కమ్మనాడు (గుంటూరు, ప్రకాశం జిల్లాలలో విస్తరించిన ప్రాంతం), వెలనాడు (రేపల్లె, తెనాలి ప్రాంతాలు), పల్నాడు (గురజాల, మాచర్ల, కారంపూడి ప్రాంతాలు) ప్రోలునాడు (పిఠాపురం, తుని, పెద్దాపురం, కాకినాడ ప్రాంతాలు), వేంగినాడు (వైజాగు, తూర్పు, పశ్చిమగోదావరిలు, కృష్ణా, గుంటూలు జిల్లాలు) అంటూ వివిధ ప్రాంతాలుగా విభజించబడి ఉండటాన్ని ఈ శాసనాల ద్వారా గుర్తించవచ్చు.

శ్రీనాథుడు ఈ ప్రాంతంలో కొంతకాలం నివసించాడు. ఆ సమయంలో అతను వ్రాసిన భీమేశ్వరపురాణంలో ఈ ఆలయ నలుమూలలను గోగులమ్మ, మందాటకి, నూకాలమ్మ, గట్టాంబికలు సంరక్షిస్తున్నారని వ్రాసాడు. వీరు గ్రామ దేవతలు. గ్రామదేవతలు హైందవదేవాలయంలో కొలువుండటం ఒక్క ద్రాక్షారామ ఆలయంలోనే చూస్తాము. అదేవిధంగా భీమేశ్వర ఆలయంలో వేంచేసిన

9. SII Vol IV - 1014

10. Draksharamam Sasanaalu by YV Ramana

మాణిక్యాదేవి శాక్తేయ సంప్రదాయానికి చెందిన దేవతకావటం కూడా ఈ ఆలయపు మరో ప్రత్యేకత[11].

ఆలయశాసనాలలో క్రీశ 1083 నాటి ఒక శాసనంలో[12] మొదటి సారిగా ద్రాక్షారామం అన్న పేరు "దాకరెమి" అని కనిపిస్తుంది. ఇదే శాసనంలో గోదావరి పేరు "గుద్రవాది" గా పేర్కొనబడింది. పెదదాకరెమి దక్షారామ, జననాథపురం, భీమానాథపురం, దక్షతపోవనం, దక్షిణకాశి అనే రకరకాల పేర్లతో వివిధ శాసనాలలో ద్రాక్షారామము పిలవబడింది. ఆలయశాసనాలు ఎక్కువభాగం లిఖించిన వ్యక్తి పేరు పెద్దనాచార్య. ఈ పేరుతో ఒకరికంటే ఎక్కువమంది ఉండి ఉండవచ్చు. కొద్ది సంఖ్యలో శాసనములు సూరాచార్య, బేతనాచార్య, మారపాచారి లిఖితం అని ఉన్నవి.

పన్నెండో శతాబ్దానికి చెందిన ప్రముఖ శైవకవి మల్లికార్జున పండితారాధ్యుడు భీమేశ్వరాలయ అర్చకుని కొడుకు. అలాగే వేములవాడ భీమకవి ద్రాక్షారామంకు చెందిన ఒక బ్రాహ్మణ వితంతువుకు పుట్టాడు. ఇతను తన తండ్రి భీమేశ్వరుడని చెప్పుకొన్నాడు.

ఒక శాసనములో[13] ఆలయములో వినియోగము కొరకు వడ్లు, పెసలు, మినుములు, అనుములు, జొన్నలు సమర్పించుకొన్నట్లు ఉంది. ఇవి శ్రీనాధుడు ఈ ప్రాంతంలో పండే పంటలు అంటూ వర్ణించిన వరి, పెసలు, మినుములు, నువ్వులు, పత్తి, జొన్నలతో సరిపోలుచున్నవి.

****

ఆలయ పరిపాలన

శాసనాలలో ఆలయ పరిపాలన నిర్వహణలకు సంబంధించిన వివరాలు పెద్దగా కనిపించవు. క్రీశ.1064కు చెందిన ఒక శాసనములో ఆలయస్థానాధిపతి అయిన రుద్రదేవర సుప్పునాయకుడు అఖండదీపారాదన నిమిత్తం భీమేశ్వరునికి ఒక లోహదివ్వె ఇచ్చినట్లు ఉన్నది[14].

మరొక శాసనములో రామేశ్వర రాశిపండిత అనే ఆలయస్థానాధిపతి

11.The Bhimeswara Temple of Draksharama by Dr.M.Ramarao, Journal of Andhra Historical Society, JAHRS Vol. 24.

12. SII Vol IV - 1015   13. SII Vol IV - 1384   14. SII Vol IV -1013

అఖండదీపాన్ని స్వామివారికి పెట్టించినట్లు తెలుస్తుంది[15].

మరోచోట ఆలయ మహాస్థానాధిపతి అయిన మద్వశిష్టపండిత భీమేశ్వరునికి చందనమును సమర్పించుకొన్నట్లు ఉన్నది[16].

పై మూడు శాసనముల ద్వారా– ఆలయ పరిపాలనానిర్వహణ కొరకు మహాస్థానాధిపతి అతని క్రింద స్థానాధిపతులు ఉండేవారని అర్ధమౌతుంది. కాలముఖ శైవశాఖకు చెందిన శైవపండితులను మహాస్థానాధిపతులు అంటారని అలంపూర్ ఆలయశాసనాలు చెపుతున్నాయి. ఎంత పెద్దమహారాజైనా తాముతెచ్చిన బహుమతులను ఈ మహాస్థానాధిపతుల పాదాలవద్ద ఉంచి తమ శిరస్సును ఆ పాదాలకు తాకించి ఆశీర్వాదం పొందేవారు. కాకతి గణపతిదేవునికి శివదీక్ష ఇచ్చిన గురువు శివదేవయ్య గురించి "చిరకాలము రాజుల కిరీటములచే స్పృశింపబడిన పాదములు కలవాడు" అని మల్కాపుర శాసనములో ఉండటాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

మహాస్థానాధిపతులు, స్థానాధిపతులు తరువాత. వారిలో–ఆలయ భాండాగారాన్ని నిర్వహించే కోష్టాగారాధిపతి, ఆలయ ఆదాయవ్యయాలను చూసే కర్మికరణాలు, పూజలు నిర్వహించే పూజారులు, ఆలయరక్షణ గావించే పదిహారిలు అంటూ వివిధ ఆలయాధికారుల పేర్లు శాసనాలలో కనిపిస్తాయి. వీరందరూ కలిసి ద్రాక్షారామ ఆలయ పరిపాలనానిర్వహణను సాగించేవారు.

స్థానిక రాజుల లేదా నాయకుల సమక్షములో దానములు ఈయబడినవి అని మాత్రమే ఉంది తప్ప వారు ఆలయనిర్వహణ పర్యవేక్షించినట్లు శాసనాలలో కనిపించలేదు. బహుసా ఆలయంపై వారి పెత్తనం లేదని అది పూర్తిగా ధార్మిక వ్యక్తులచే నిర్వహించబడేదని భావించవచ్చు.

****

శాసనాలలో కనిపించే ఆనాటి సమాజం

ఒకనాటి సమాజం చాతుర్వర్ణ నిర్మితం. ప్రతివర్ణానికి ఒక స్వధర్మం అనేది నిర్ధేశించబడింది. ద్రాక్షారామ ఆలయశాసనాలలో అన్ని వర్ణాలకు సంబంధించిన వ్యక్తులు వారి నిర్వహించిన వృత్తులు చాలా స్పష్టంగా చెప్పబడ్డాయి.

15. SII Vol IV - 1229   16. SII Vol IV - 1256

ఈ

కొన్ని చోట్ల తమ వర్ణానికి నిర్దేశించిన ధర్మానికి అతీతంగా క్షత్రియధర్మాన్ని పోషించే బ్రాహ్మణులు, శూద్రులు అదే విధంగా బ్రాహ్మణ ధర్మాన్ని అనుసరించే శూద్రులు కనిపిస్తారు[17].

బ్రాహ్మణులు

బ్రాహ్మణులు జ్ఞానసంబంధ రంగంలోనే కాక పరిపాలనా విభాగంలో కూడా ముఖ్యపాత్ర వహించినట్లు అనేక శాసనాల ద్వారా తెలుస్తుంది. ఆనాటి సమాజంలో బ్రాహ్మణులు పోషించిన వివిధ పాత్రలు ఇలా ఉన్నాయి

క్రీశ. 1163లో నల్లయభట్లు కులోత్తుంగ రాజేంద్రచోడుని వద్ద ఆస్థాన జ్యోతిష్కుడిగా ఉన్నాడు. ఇతను భీమేశ్వరునికి దీపం, కర్పూరము దానమిస్తూ తాను వరాహమిహిర విభాగానికి చెందిన జ్యోతిష్కుడనని చెప్పుకొన్నాడు.

మరో శాసనములో "పరహిత పరతంత్ర" వైద్యవిభాగంలో నిష్ణాతుడైన ఒక బ్రాహ్మణుడు దాన మిచ్చినట్లు ఉన్నది[18]. ఆనాటి బ్రాహ్మణులు వైద్యవృత్తిలో ఉన్నట్లు, వైద్యవృత్తిలో కూడ వివిధ విభాగాలు ఉన్నట్లు ఈ శాసనము ద్వారా అర్థమౌతుంది.

క్రీశ. 1437నాటి ఓ శాసనములో భీమ వల్లభపురంలోని ధర్మాసనమునకు చెందిన లింగంభొట్లు అనే బ్రాహ్మణుడు తన యావదాస్థిని భీమేశ్వరునికి సమర్పించుకొన్నట్లు ఉన్నది. ధర్మాసనం అనేది న్యాయస్థానం అనుకొంటే కొంతమంది బ్రాహ్మణులు న్యాయాధికారులుగా పనిచేసారని భావించవచ్చు.

ఆకాలంలో చాలామంది బ్రాహ్మణులు రాజుకి సలహాలు ఇవ్వటానికి ప్రధానులుగా పనిచేసేవారు. క్రీశ. 1149 కు చెందిన ఒక శాసనములో ఆర్యపెగ్గడ అనే బ్రాహ్మణుడు త్రిభువనమల్లుని వద్ద మహాప్రధానిగా పనిచేసినట్లు తెలుస్తున్నది. క్రీశ. 1140నాటి మరో శాసనముద్వారా కశ్యపగోత్రానికి చెందిన వెన్నయ సోమయాజి, వెలనాటి రాజేంద్రచోడుని వద్ద ప్రధాని అని అర్థమౌతుంది.

కొందరు బ్రాహ్మణులు దండనాయకులు, సేనాధిపతులుగా కూడా

---

17. The Inscriptions of Draksharama a Cultural Study, SV University, PhD thesis by N.V. Ramaiah Chowdhary

18. SII Vol IV - 1172 వ్యక్తిపేరు లేదు

వ్యవహరించారని కొన్ని శాసనాలు తెలుపుతున్నాయి. క్రీశ. 1149 కు చెందిన ఒక శాసనములో భరద్వాజ గోత్రానికి చెందిన నాగదేవయ అనే వ్యక్తి దండనాయకుడని చెప్పబడ్డాడు. వాసనపెగ్గడ అనే బ్రాహ్మణుడు, కులోత్తుంగచోడ రెండవ గొంకరాజు వద్ద సమస్తసేనాధిపతిగా పనిచేసినట్లు తెలుస్తున్నది[19].

ఆలయనిర్వహణా విధులను నెరపే స్థానాధిపతులుగా పనిచేసిన విషయం ఇంతకుమునుపే చెప్పుకొన్నాం. ద్రాక్షారామ ఆలయశాసనాలలో వచ్చిన వివిధ బ్రాహ్మణుల గోత్రాలలో కశ్యప, భరద్వాజ గోత్రాలు పలుమార్లు వచ్చాయి. బాహ్మణుల పేర్లలో సంస్కృత మూలాలు ఎక్కువగా ఉండటం గమనార్హం

క్షత్రియులు

ద్రాక్షారామ ఆలయంలో క్షత్రియులకు సంబంధించిన శాసనాలు కనిపించవు.

వైశ్యులు

సుమారు ఇరవైకి పైగా శాసనాలలో వైశ్యుల ప్రస్తావన ఉన్నది. వీరు బచ్చు, వైశ్య, కోమటి, శెట్టి లాంటి పేర్లతో వ్యవహరింపబడ్డారు. వీరు పెనుగొండ (పశ్చిమగోదావరి జిల్లా), పేరూరు (కడప) లాంటి తెలుగు ప్రాంతాలనుండే కాక మధ్యప్రదేష్‌కు చెందిన బస్తర్ లాంటి సుదూర ప్రాంతాలనుంచి కూడా వచ్చి భీమేశ్వరుని దర్శించుకొని కానుకలు సమర్పించుకొన్నట్లు తెలుస్తుంది.

అప్పట్లో వైశ్యులు వ్యాపారాలే కాక రాజాశ్రయం పొంది వివిధ పదవులు కూడా నిర్వహించేవారు. క్రీశ 1132 నాటి ఒక శాసనములో గొన్ని శెట్టి కుమారుడైన కళ్ళయసా అనే ఒక వైశ్యుడు లక్ష్మరాసదండనాయకుని వద్ద సాహిణి (horse-keeper) అని ఉన్నది. అదే విధంగా క్రీశ 1168నాటి శాసనములో నాగిశెట్టి పేరుగల వైశ్యుడు కులోత్తుంగచోడుని వద్ద భాండాగారాధికారి (Treasurer) అని తెలుస్తుంది. వైశ్యుల పేర్లలో ద్రావిడ మూలాలు ఎక్కువగా ఉండటం గమనార్హం

చతుర్థాన్వయులు

మిగిలిన వర్ణాలతో పోల్చినపుడు సమాజంలో శూద్రులు సంఖ్యాపరంగా

19. SII Vol IV - 1089 20. SII Vol IV - 1217

ఎక్కువగా ఉంటారు. వీరిలో కొద్దిమంది మహాప్రధాని, సేనాధిపతి, దండనాయక స్థానాలను దక్కించుకొన్నారన్న సంగతి శాసనాలలో దొరుకుతుంది.

క్రీశ.1236 నాటి ఒక శాసనములో కాకతీయ గణపతికి మల్లాల వేమాద్రిరెడ్డి మహా ప్రధానిగా ఉండినట్లు తెలుస్తుంది. క్రీశ1149 లో కామినాయకుడు అనే పేరుగలిగిన చతుర్ధాన్వయుడు దండనాయకుడి హోదాలో భీమేశ్వరునికి అఖండవత్తి, లోహపాత్రలు సమర్పించుకొన్నాడు. మరో చోట ముప్పినాయకుడు అనే వ్యక్తి వెలనాటి రాజేంద్రచోడుని వద్ద పడవాలుగా (సేనాపతి) పనిచేసినట్లు తెలుస్తుంది. ఇదే రాజేంద్రచోడుని వద్ద ఎరియనాయకుడు అనే వ్యక్తి భాండాగారాధికారిగా, సూరపరెడ్డి అనే మరో వ్యక్తి ముదిసలిగా (రాజుగారి ఆహార తనిఖీ అధికారి) పనిచేసేవారు.

పై శాసనాధారాలను బట్టి చతుర్ధాన్వయులు అప్పట్లో వారివర్ణధర్మాలనే కాక ఇతరపదవులు కూడా చేపట్టారని అర్ధమౌతుంది.

క్రీశ 1263కి చెందిన ఒక శాసనములో తలారి ముప్ప్రమాణినాయకుని కుమారుడైన తలారి పల్లినాయకుడు తన తల్లిదండ్రుల దర్మార్ధమై ఇనుపఎడ్లు దానం చేసినట్లు ఉన్నది. తలారి అంటే గ్రామకావలి. తండ్రిపేరులో కూడా తలారి ఉండటాన్ని బట్టి బహుశా ఆ ఉద్యోగం వంశపారంపర్యమైనది కావొచ్చును.

వీరేకాక అనేక ఇతర కులాలవారు కూడా వివిధసేవలలో పాల్గొన్నట్లు శాసనాలద్వారా తెలుస్తుంది. ఆలయమునకు దానముగా ఇచ్చే ఆవులు, గేదెల, గొర్రెలసంరక్షణ కోసం అనేకమంది బోయిలు ఉండేవారు. వీరు యాదవకులానికి చెందినవారు. దానంగా ఇవ్వబడిన పశువుల పోషణ గావించి, పాలు, నెయ్యి ఆలయానికి క్రమంతప్పకుండా అందించటం వీరిపని.

వీరేకాక శ్రీమంగలి, మాలకార, కమ్మరి, స్వర్ణకార, వద్రంగి, కొండమంగలి, చాకలి కులాలకు చెందిన వివిధ వృత్తుల వారు ఆలయాన్ని ఆశ్రయించుకొని ఉండేవారని ఒక శాసనములో[21] కలదు. ఆలయనిర్మాణము, శాసనములు వ్రాయటానికి ఆచారి లేదా ఓజు నామాంతాలతో శిల్పులు ఉండేవారు. ద్రాక్షారామ శాసనాలలో చాలామట్టుకు పెద్దనాచారి శిల్పకారునిచే లిఖించబడినవే. ద్రాక్షారామ ఆలయంలో రాప, నారాయణ అనే వద్రంగులు

---

21. SII Vol IV - 1369

ఆలయానికి సేవలందిస్తున్నందుకు పరాంతక చోళుడు కొంతభూమిని దానంగా ఇచ్చినట్లు ఒక శాసనం తెలుపుతుంది.

స్త్రీలు

సామాజిక కార్యక్రమాలలో ఉండే స్త్రీల ప్రాతినిధ్యం ఆ సమాజపు చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. ద్రాక్షారామ ఆలయానికి సంబంధించి మొత్తం 65 శాసనాలలో స్త్రీల ప్రస్తావన ఉన్నది. ఇవి చాలామేరకు రాజకుటుంబ స్త్రీలు ఇచ్చిన దానాలు, స్వల్ప సంఖ్యలో సామాన్య కులకాంతలకు సంబంధించినవి. మొత్తం శాసనాలతో పోల్చుకొన్నప్పుడు స్త్రీలను గురించి చెప్పే శాసనాలు సుమారు 16% ఉన్నాయి. ఇది సమకాలీన సమాజంతో పోల్చినపుడు తక్కువ అనిపించినా జమిందారీ యుగంతో పోల్చుకొన్నప్పుడు ఎక్కువేనని చెప్పుకోవాలి.

ఆలయముల చరిత్ర చెప్పేటప్పుడు చర్చకువచ్చే మరో అంశం ఆలయ నర్తకిలు. గుడిలో ఉంటూ నాట్యము, సంగీతము లాంటి కళలను ప్రదర్శించే స్త్రీలను సానులు, సాని సంప్రదాయమువారు, గుడిసానులు అని పిలిచేవారు. వంశపారంపర్యంగా నాట్యవృత్తిని కొనసాగిస్తున్న వారని సాని సంప్రదాయమువారు అంటారు. గుడిసానులు[22] వ్యభిచారులు కాదు. వీరు సంగీత నాట్యశాస్త్రాలను నేర్చుకొని దేవుని సేవకు, ఆలయంలో ఇతర కైంకర్య పనులకు భక్తితో అంకితమైనవారు. ఆలయములలో జరిగే అంగరంగభోగములను గుడిసానులే జరిపించేవారు. (అంగభోగము అంటే దేవతా విగ్రహములకు చేసే అలంకారాలు నివేదనలు. రంగభోగము అంటే గుడిని శుభ్రపరచి ముగ్గులతో అలంకరించటం)

కొన్ని శాసనాలలో కనిపించే జ్ఞానసాని, సూరసాని, దొడ్డసాని లాంటి పేర్లలో ఆయా వివాహితుల పేర్లకు చివర సాని అనే పదం స్వామిని (భార్య) అనే అర్థంలో వాడబడిందని అర్థం చేసుకోవాలి.

తెలుగునాట వివిధ గుడి సానులకు ఇచ్చిన దాన శాసనాలు మొత్తం 74 కలవు. ద్రాక్షారామానికి సంబంధించి అలాంటి శాసనం ఒకటికూడా లేకపోవటం ఆశ్చర్యం కలిగించకమానదు. అలాగని ద్రాక్షారామ ఆలయంలో గుడిసానులు లేరని చెప్పలేం.

****

---

22. గుడిసానిలపై పుస్తకంచివరలో విపులమైన వ్యాసం కలదు.

భార్యా భర్తలు చెరిసగం అనే ప్రాతిపదికన, భర్త చనిపోయిన స్త్రీలో భర్తయొక్క సగభాగం ఇంకా బ్రతికి ఉన్నట్లే కనుక ఆమెకూడా భర్త ఆస్తికి హక్కుదారు అవుతుందని అయిదో శతాబ్దానికి చెందిన యాజ్ఞవల్క్య స్మృతి చెప్పింది. అది ఆనాటి రాజ్యాంగం కనుక అప్పట్లో వితంతువులతో సహా స్త్రీలకు ఆస్తిలోహక్కు ఉండేదని అనుకోవచ్చు. రాజస్త్రీలు తమకు తాముగా భీమేశ్వరునికి అనేక దానములు ఇవ్వటాన్ని గమనిస్తే, ఆనాటి సాంఘికవ్యవస్థలో స్త్రీలు ఆర్థిక స్వాతంత్ర్యం కలిగిఉండేవారని అర్థమౌతుంది. ద్రాక్షారామ ఆలయానికి దానం ఇవ్వబడ్డ మొత్తం 53 మాన్యాలలో 8 మాన్యాలను స్త్రీలు ఇవ్వటం గమనార్హం.

కాకతి రుద్రదేవరాజు భార్య దన్నమదేవి క్రీశ.1169లో నిత్యదీపారాధన ఏర్పాట్లు చేయించారు[23]. క్రీశ.1135 లో ముమ్మడి కోనరాజు భార్య రాజదేవి భీమనాధునికి అఖండదీపాన్ని సమర్పించుకొన్నారు[24].

రెండవ గొంకరాజు వద్ద ప్రధాని, సమస్త సేనాధిపతిగా పనిచేసిన వాసనపెగ్గడ కూతురు గుండమ భీమేశ్వరునికి అఖండదీపం సమర్పించుకొన్నది[25].

దూరప్రాంతం నుంచి వచ్చిన భక్తులు స్థానికంగా కొన్ని భూములను కొని, స్వామికి సమర్పించుకొన్నట్లు కొన్ని శాసనాలలో కనిపిస్తుంది. కళింగరాజ్యానికి చెందిన అనంతపాల దండనాయకుని భార్య మహాదేవి ఇరవై మాడలు పెట్టి ఆలయసమీపములో ఒక నందనవనమును కొని ఆలయసేవకులకు స్వామిపేరిట దానం చేసెను [26].

భక్తులు చేసే దానములు చాలామట్టుకు శివయోగినులకు, బ్రాహ్మణులకు, విద్యార్థులకు, పొరుగూరినించి వచ్చే భక్తులకు, ఆలయసేవకుల పోషణ కొరకు ఇచ్చినట్లు అనేక శాసనముల ద్వారా తెలుస్తుంది.

కొన్ని శాసనములలో ఎంతమందికి పోషణ జరపించాలి అనే వివరాలు ఉండటం విశేషం.

కులోత్తుంగ చోడదేవుని వద్ద పనిచేసే ఒక అధికారి కూతురు భీమేశ్వరునికి ముప్పై పుట్ల భూమిని దానం ఇచ్చి దానిపై వచ్చే ఆదాయంతో ఈ క్రిందివిధంగా జరిపించాలని శాసనం వ్రాయించింది.

---

23. SII Vol IV - 1095 24. SII Vol IV - 1041 25. SII Vol IV - 1089
26. SII Vol IV - 1211

ఇరవైమంది బ్రాహ్మణులకు యాభైకుంచముల ధాన్యం, మూడు కుంచముల పప్పు, నేతికి ఒకమాడ, నంజుడ్లకు (పచ్చళ్ళు) నాలుగు మాడలు, మిరియములు అరసోల, సక్కులకు (అట్లు) మూడు మాడలు, ఉప్పుకు ఒకమాడ, బెల్లంకు ముప్పై మాడలు ఇయ్యవలెను; వంట బ్రాహ్మణునికి మూడు మాడలు; కట్టెలు తెచ్చిన వానికి మూడు మాడలు; ఎంగిళ్ళు ఎత్తే, నీళ్ళు తెచ్చే ఇద్దరికి మూడు మాడలు చొప్పున ఇచ్చి – ఈ విధంగా ఆచంద్రతారార్కం జరిపించాలి[27]. 7 7

****

మహాభారతమును ఆంధ్రీకరించిన నన్నయ భట్టారకుడు రాజమహేంద్రవాసి. అప్పటికే గొప్ప శైవ క్షేత్రముగా ఎదుగుతున్న ద్రాక్షారామమును దర్శించే ఉంటాడు. కానీ నన్నయ కు సంబంధించిన శాసనాధారాలు కానీ, ఇతర సాహిత్య విశేషాలు కానీ కనిపించవు.

నన్నయ మహాభారతాన్ని రచిస్తున్నపుడు తన సహాధ్యాయుడు, ధరామరవంశ విభూషణుండు, వాఙ్మయ ధురంధరుడు, ఎంతో ఇష్టుడు అయిన నారాయణభట్టు అనేమిత్రుడు తనకు సహాయపడినట్లు చెప్పుకొన్నాడు[28]. ఈ నారాయణభట్టు వ్రాసిన మహాభారత భాగాలేమిటో తెలియరావు.

ఈ నారాయణభట్టు కూతురు కుపమ అఖండవత్తి, లోయపుదివియ, యాభై ఇనుపఎడ్లు, భీమేశ్వరునికి సమర్పించుకొన్నట్లు క్రీశ1050 నాటి ఒక శాసనము ద్వారా తెలియుచున్నది.

కొన్ని శాసనాలలో రాజుగారి భోగస్త్రీ లేదా లంజియ పేరుతో దానాలు కనిపిస్తాయి. అలాంటి స్త్రీలకు బహుసా ఆకాలములో అధికారిక భార్యలతో సమానమైన హెూదా లభించేదని భావించాలి.

ఆనాటి జీతభత్యాలు

ఆలయాన్ని నమ్ముకొని ఉపాధిపొందుతున్న సిబ్బందికి ఒక సాలుకు 7
4 ఆలయ ఖజానానుంచి ఇచ్చిన జీతభత్యాల వివరాలు సప్తమ విష్ణువర్ధనుడి కాలంలో (క్రీ.శ. 1070–1118) వేయించిన ఒక శాసనములో[29] కలవు

1. వడ్లు దంచే ఒక స్త్రీకి: ఒక మాడ, 13 పుట్ల ధాన్యం (పుట్టి 20 కుంచాలు)

---

27. SII Vol IV - 1015
28. కవిజీవితములు, గురజాడ శ్రీరామమూర్తి పే. 54
29. SII Vol IV - 1288

2. వంటచెరకు తెచ్చే కూలీకి: ఒక మాడ, 13 పుట్ల ధాన్యం
3. వంటమనిషికి 5 చిన్నాలు[30], 1 పుట్టి ధాన్యం
4. విస్తర్లు కుట్టే వ్యక్తికి 3 చిన్నాలు
5. కుమ్మరి 5 చిన్నాలు, 6 పుట్ల ధాన్యం

మొదటి రెండు పనులు చేసే వారికి ఇచ్చే కూలి మిగిలినవారికూలికంటే ఎక్కువగా ఉండటం గమనించవచ్చు. వడ్లు దంచటం, అడవిలో కర్రలు కొట్టి బండిపై తీసుకురావటం లాంటివి ఒకరికంటే ఎక్కువమంది చేయాల్సిన పనులు. కానీ శాసనపాఠంలో వడ్లు దంచ్చుదానికి, కట్టలు వెట్టువానికి అని ఏకవచన సంభోదన ఉన్నది. ఆనాటి సమాజంలో శారీరిక కష్టానికి ఎక్కువ ప్రతిఫలం దక్కేదా అనే సందేహం కలుగుతుంది.

అదే కాలానికే చెందిన మరో శాసనముద్వారా[31] – శ్రీమంగలి ఒక్కనికి 6 చిన్నాలు, మాలకారునికి 4 చిన్నాలు, కుమ్మరి సారె ఒక్కింటికి 8 చిన్నాలు, ఒడ్డరికి (మట్టిపనిచేసే వ్యక్తి) 8 చిన్నాలు, కమ్మరికి 8 చిన్నాలు, కంసాలికి 8 చిన్నాలు, కండమంగలికి 8, చాకలికి 8 చిన్నాలు, అఖండ దీపాన్ని సంరక్షించే వ్యక్తికి 3 చిన్నాల చొప్పున వివిధ వృత్తులు నెరపే ఆలయసిబ్బందికి అప్పట్లో జీతాలు ఇచ్చినట్లు తెలుస్తుంది.

రాజులు చేసిన దానాలు

ఈ ప్రాంతాన్ని పాలించిన తూర్పు చాళుక్యులు, చోళులు, కాకతీయులు, కల్యాణచాళుక్యులు, రెడ్డిరాజులు, గజపతులు, విజయనగర రాజులు, కోనరాజులు చోడులు, కోటరాజులు లాంటి పాలకులు ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి అనేక దానాలు చేసి వివిధ శాసనాలను వేయించారు. ఇవి పదకొండవ శతాబ్దంలో మొదలై పదహారో శతాబ్దం వరకూ విస్తరించి ఉన్నాయి.

రాజరాజ నరేంద్రుని కాలంనాటికే ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రంగా రూపుదిద్దుకొంది. రాజరాజ నరేంద్రుడు వేయించిన శాసనాలు ఏవీ ఆలయంలో

30. చిన్నము అంటే ఒక వరహాలో ఎనిమిదో వంతు విలువచేసే వెండినాణెము.
31. SII Vol IV - 1288

కనిపించకపోయినా ఇతని పాలనాకాలంలో ఒక కోమటి భీమేశ్వరునికి సంధ్యదివ్వెలు, దేవాలయముపై ఎగిరే జండా కొరకు రెండు తెల్లని వస్త్రములు సమర్పించుకొన్నట్లు క్రీశ 1038 లో వేయించిన శాసనముద్వారా తెలుస్తున్నది. దేవాలయములో లభించే అత్యంతపురాతనమైన శాసనము[32] ఇంతవరకూ ఇదే.

రాజరాజ నరేంద్రుని తరువాత అతని సవతితమ్ముడు విజయాదిత్య VII వేంగిసింహాసనాన్ని అధిష్టించాడు. ఇతని కూతురు గుణారామ, జగదేకసున్దరి, మత్తేభమందగమన అయిన సోమలదేవి క్రీశ1065 లో భీమేశ్వరునికి అఖండదీపాన్ని, మణులహారాన్ని సమర్పించుకొన్నది. క్రీశ. 1064 నాటి మరో శాసనములో[33] విజయాదిత్య VII పాలిస్తూండగా సుప్పనాయక అనే బ్రాహ్మణుడు దేవరకు దీపదానం చేసినట్లు ఉంది.

క్రీశ 1083 సంవత్సరంలోని ఒక శాసనంలో బేతినాయుదు కూంతుఋ జయమ ద్రాక్షారామ ఆలయంలో ఉన్న కులోత్తుంగచోడ సత్రానికి ముప్పది పుట్ల పంటభూమి దానంగా ఇచ్చింది. రాజరాజ నరేంద్రుని కొడుకు రాజేంద్రచోడుడు. ఇతను తమిళనాడులోని చోళరాజ్యంలో రాజకీయశూన్యం ఏర్పడినప్పుడు క్రీశ. 1070 లో కులోత్తుంగ I పేరుతో అధిష్టించాడు. పై శాసనం ద్వారా ఇతను తనపేరుమీద ఒక సత్రం కట్టించి ఉంటాడని ఊహించవచ్చు.

వెలనాటిచోడ రెండవ గొంకరాజు భీమేశ్వరునికి క్రీశ. 1142 లో నిత్యదీపారాధనకు ఇరవై దీపపుసెమ్మెలు, దీపారాధనకొరకు వెయ్యి ఇనుప ఎడ్లు దానమిచ్చాడు. ఇతనే కీశ. 1148 లో మరలా బంగారు కశలాలను, దీపంసెమ్మె, బంగారు ఆభరణములను సమర్పించుకొన్నట్లు, పదిద్వారములు కలిగిన కోష్టమండప నిర్మాణం గావించినట్లు, ద్వారపాలక విగ్రహములను ఏర్పాటుచేసినట్లు శాసనములు కలవు. చోడరాజులందరిలో రెండవ గొంక రాజు అనేక దానములిచ్చిట్లు సుమారు ముప్పై పైన శాసనములు కలవు[34] .

***

అనుమకొండ కాకతి రుద్రదేవుని ప్రస్తావన మొదటి సారిగా 1158 లో అతని మంత్రి ఇనంగల బ్రహ్మిరెడ్డి చేసిన ఒక దానశాసనంలో కనిపిస్తుంది[35].

---

32. SII Vol IV - 1014 33. Inscriptions Of The Madras Presidency Vol. 2 p.724
34. South Indian Inscriptions, Vol IV No. 1140-1142
35. SII Vol IV - 1107

రుద్రదేవుడు కాకతీయ సామ్రాజ్యాన్ని ఆంధ్రావరకు విస్తరించినపుడు వేయించిన మొదటి శాసనం ద్రాక్షారామంలో ఉన్నది. అది క్రీశ. 1186లో ద్రాక్షారామ భీమేశ్వరునికి రుద్రదేవుడు అఖండవత్తి, లోహదణ్డు సమర్పించుకొన్న సందర్భంగా వేయించిన శాసనము.

కాకతి గణపతి దేవుడు (క్రీశ.1199-1262) మొత్తం ఆంధ్రదేశాన్ని ఒకే పాలన క్రింద తీసుకొచ్చాడు. ఇతని పాలనకు సంబంధించి మొత్తం 7 శాసనాలు[36] ద్రాక్షారామ ఆలయంలో ఉన్నవి. వాటిలో- కాకతి గణపతిదేవుని ఆధ్యాత్మిక గురువు ధర్మశివ క్రీశ 1234 లో సమర్పించిన దీప దానం, క్రీశ. 1262 లో స్వామివారికి గణపతిదేవుల ఆజ్ఞప్రకారం మకరతోరణము, సింహాసనము, బంగారుచామరములు, బంగారుపల్లకి, సంగీతవాయిద్యపరికరములు సమర్పిస్తున్నట్లు మరొక శాసనము చారిత్రికంగా ముఖ్యమైనవి.

గణపతిదేవుని తరువాత రాజ్యం చేసిన రుద్రమదేవి పాలనలో ఆమెకు సంబంధించిన ఒక శాసనం కలదు. క్రీశ. 1278 లో కాకతియ్య రుద్రమదేవికి శుభం కలగాలని సురయ రెడ్డి అనే వ్యక్తి మామిండివాడ అనే గ్రామంలో తనకు వచ్చే వాటాను భీమేశ్వర స్వామికి అఖంఢదీపారాధన కొరకు సమర్పించుకొన్నాడు.

ప్రతాపరుద్రుని (1289-1323) పాలననుండి ఒకే శాసనం కనిపిస్తుంది. కాకతీయ ప్రతాపరుద్రుని వద్ద మహాప్రధానిగా ఉన్న అన్నయ ప్రధాని క్రీశ. 1293 లో భీమేశ్వరస్వామివారి అఖండదీపానికి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తుంది.

****

వెలనాటిచోడ రెండవ గొంకరాజు కొడుకు రాజేంద్రచోడుడు II (క్రీశ. 1163-80) తండ్రికి తగ్గ తనయుడు. ఇతను సతీసమేతంగా వచ్చి స్వామివారిని దర్శించుకొని ఇచ్చిన అనేక దానాలకు సంబంధించి ఇరవైకి పైన శాసనాలు కలవు. పందమదేవి, గోకమహాదేవి ఇతని భార్యలు. రాజేంద్రచోడుని శాసనములలో పదవలు (సామాన్య అధికారి), కొట్టరువు (కోశాధికారి), ముదుసలి (రాజుగారి ఆహారతనిఖీ అధికారి), భండారము (భాండాగారాధికారి) అనే ఆనాటి వివిధ అధికారిక హొదాలు తెలుస్తాయి[37].

---

36. SII Vol IV - 1117, 1056, 1342 B

37. SII Vol IV - 1205

అనంగ భీమదేవ/అనంతవర్మ చోడగంగ (క్రీశ.1178–1198) గంగ నుంచి గోదావరి వరకు పరిపాలించిన తూర్పుగాంగు రాజు. ఇతనికి సంబంధించిన 8 శాసనాలలోనూ ఇతని భార్యలైన లావణ్యవతి, రాజలదేవి, పద్మలదేవి, కలిగమహదేవి, జయగొండచోడ, శ్రీయదేవి, లీలావతిదేవి, కళ్యాణవతి, జెన్నమహాదేవి పేర్లు వరుసగా ఉండటం గమనార్హం

హైహయవంశ స్థాపకుడైన ముమ్మడి భీమ కుమార్తె భీమేశ్వర స్వామికి దీపదానం ఇచ్చినట్లు ఒక శాసనం[38]ఉన్నది.

****

పద్నాలుగో శతాబ్దంలో మహమ్మదీయులు చేసిన దాడులకు ఆంధ్ర ప్రాంతం చాలా ఒడిదుడుకులకు గురయ్యింది. శ్రీకూర్మం, సింహాచల ఆలయాలపై ముస్లిం సేనలు చేసిన దాడులు అటు శాసనాలలోను, ఇటు సాహిత్యంలోను దొరుకుతాయి. కానీ ద్రాక్షారామ ఆలయంపై ముస్లిం దాడులు జరిగాయని చెప్పే శాసనాధారాలు కానీ సాహిత్యాధారాలు కానీ లభించవు. సుమారు సమయంలో క్రీశ.1384లో అనవోత వేమారెడ్డి అనేక మండపములు, గోపురములు, ప్రాకారము, నేలమాళిగలు, నాలుగుద్వారములు నిర్మింపచేసినట్లు ఒక శాసనములో[39] ఉండటం గమనార్హం. ఇది జీర్ణోద్ధరణా, పునరుద్ధరణా లేక విస్తరణా అనేది చెప్పటం కష్టం.

అలాగే 1414 లో ఆస్థానమండప నిర్మాణము, ప్రాకార నిర్మాణలను తన ప్రభువు కాటవేమారెడ్డికి శుభం కలగాలని కడియం మంచినేడు అనే వ్యక్తి కట్టించాడు[40].

విజయనగర రాజుల గురించి ఒకే ఒక శాసనము కలదు. ఇది 1444 లో ప్రౌఢ దేవరాయుల పాలనలో శెట్టి అనే వ్యక్తి చేసిన దానముకు సంబంధించినది[41]

అదే విధంగా గజపతి రాజులకు సంబంధించి కూడా రెండు శాసనములు మాత్రమే కనిపిస్తాయి. ఒకదానిలో రాణిభానుదేవమ్మ మండపాన్ని కట్టించిన వివరములు, రెండవదానిలో పురుషోత్తమరాజు చేసిన దానము గురించి కలదు[42].

---

38. SII Vol IV - 1100 39. SII Vol IV - 1379 40. SII Vol IV - 1329
41. SII Vol IV - 1375 42. SII Vol IV - 1362

వ్యక్తులు చేసిన దానాలు

కోన సత్యచోడ గంగ్గ అనే వ్యక్తి తనకు సంక్రమించిన భూమిని భీమేశ్వర ఆలయానికి పడమటవైపున ఉన్న సత్రములో పొరుగూరిలనుంచి వచ్చే భక్తుల సౌకర్యముల నిమిత్తం స్వామివారికి ధారాదత్తం చేసాడు[43].

వీరకోటకు చెందిన సౌభాగ్యదేవరాజు బిక్కవోలు గ్రామంలో రెండు పుట్ల భూమిని కొనుగోలు చేసి స్వామివారి నిత్యనైవేద్యం కొరకు సమర్పించుకొన్నాడు[44].

క్రీశ. 1048 సంవత్సరములో పోలిసెట్టి అనే వైశ్యుడు ఉత్తరాయణ సంక్రాంతి పుణ్యదినమున భీమేశ్వర స్వామికి అఖండదీపారాధన కొరకు దీపపు సెమ్మలను దానం చేసాడు. క్రీశ. 1068 లో కమ్మకోమటి (కమ్మనాడుకి చెందిన కోమటి) అనే వ్యక్తి నిత్యదీపారాధన ఏర్పాటు చేసాడు.

****

వివిధ రకాల దానాలు

ద్రాక్షారామ ఆలయానికి భక్తులు- గ్రామాలు, పంట భూములు, ఉద్యానవనాలు, పశువులు, ధనము, ఆభరణాలు లాంటి వివిధరకాల దానాలను సమర్పించుకొన్నారు[45]. ఈ దానములను ఎక్కువగా సంక్రాంతి దినములలో, కొత్త అమావశ్య రోజున, గౌరీవ్రతం నాడు, వివిధ గ్రహణముల సమయములలోను చేయటం అనేక శాసనములలో కనిపిస్తుంది. ఆలయాన్ని దర్శించుకొన్న వేరేప్రాంత వాసులు ఏదైనా దానం ఇచ్చేటపుడు స్థానికంగా ఉండే ప్రముఖులను సాక్షులుగా పెట్టుకొనే సాంప్రదాయం ఉన్నట్లు కనిపిస్తుంది. హైహయ నాయకుడైన బీమరాజు ముప్పై ఖండికల పంటభూమిని, పద్దెనిమిది ఖండికల తోటను భీమేశ్వరునికి సమర్పించుకొన్నప్పుడు వేయించిన శాసనము చివరలో దీనికి సాక్షులు కేసవ ప్రెగడ, దండనాయక మండా అనే ఇద్దరి స్థానికుల పేర్లు కలవు.

ద్రాక్షారామ భీమేశ్వరునికి భక్తులు వివిధ కాలాలలో మొత్తం 13 గ్రామాలను దానంగా ఇచ్చారు. ఈ గ్రామాలనుంచి వచ్చే ఆదాయాన్ని ఆలయ

43. SII Vol IV - 1104 44. SII Vol IV - 1343

45. The Inscriptions of Draksharama a Cultural Study, SV University, PhD thesis by N.V. Ramaiah Chowdhary

క్రతువుల కొరకు వినియోగించమని శాసనాలు వేయించారు. క్రీశ 1231 లో హైహయ వంశానికి చెందిన రాణి పద్మావతి భీమేశ్వరదేవరకు ఖుండెనపల్లి గ్రామాన్ని అంకితం చేస్తూ, ఆ గ్రామం నుంచి వచ్చే ఆదాయాన్ని దేవతార్చనకు, మరమ్మత్తులకు వినియోగించమని కోరినది.

ప్రేకేటి వీరపనాయకుని కూతురు సూరమదేవి తన తల్లిదండ్రులకు ధర్మార్ధముగా ప్రతిఏటా గౌరివ్రతం వైభవోపేతంగా జరిపించేందుకు ఒడ్డాదిలోని సంకు భీమవరము అనే గ్రామాన్ని క్రీశ 1252 భీమేశ్వరునికి దానం చేసినది. ఇదే విధంగా పంద్రువాడ, శేషవరం, విశ్వనాథపట్టణం, మదువాడ, నడకుదురు లాంటి వివిధ గ్రామాలు ద్రాక్షారామ ఆలయమునకు దానం చేయబడినట్లు శాసనాలు కలవు.

***

12 నుండి 14వ శతాబ్దం మధ్యకాలంలో పంటభూములను విస్తారముగా ఆలయానికి దానం చేసినట్లు 49 శాసనాలు చెపుతున్నాయి. ఇవేకాక వివిధ భక్తులు అనేక ఉద్యానవనాలను/తోటలను దేవరకు సమర్పించుకొన్నట్లు 23 శాసనాలు కలవు. కొన్ని సార్లు దాతలు స్వయంగా ఆలయ సమీపభూములను కొని దేవునికి అర్పించేవారు. ద్రాక్షారామ భీమేశ్వరునికి ఇచ్చిన భూములు ఎక్కువగా పరిసరప్రాంతాలలోనివే అయినప్పటికీ ఆర్కోట్, తిరుచ్చి లాంటి దూరప్రాంతాల భూములు కూడా దానం ఇచ్చినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

ద్రాక్షారామ భీమేశ్వర ఆలయానికి వచ్చే భక్తుల భోజనసదుపాయముల కొరకు కుళోత్తుంగ చోడ సత్రం, మహేశ్వర మఠం, అండరి మఠం, ఎరమఠం, ఆరిమఠం, తిరువీధి మఠం, పెదమాటి సత్రం లాంటి వివిధ వసతులు ఉండేవి. వీటిలో తిరువీధి మఠం ఉచిత భోజనవసతి కల్పిస్తూ విద్యనేర్పే పాఠశాల.

పంటభూములను దానం ఇస్తూ వాటి ద్వారా వచ్చే ఫలసాయంతో పైనచెప్పిన సత్రాలలో వసతిపొందే భక్తులకు, విద్యార్ధులకు, మునులకు భోజనసదుపాయం కల్పించమని వివిధ భక్తులు కోరేవారు.

దేవాలయాలకు భక్తులు తోటలను దానం ఇచ్చినట్లు అనేక శాసనాలలో ఉంది. ఆ తోటలలో పూలు, పత్రి, పండ్లు, తమలపాకులు, పోకచెక్కలు లాంటివి సాగుచేసి స్వామివారి ఆరాధన కొరకు వినియోగించేవారు. ఈ తోటలకు

నందనవనము, పుష్పవనము, దవనవనము లాంటి పేర్లు ఉండేవి. ద్రాక్షారామ భీమేశ్వరాలయప్రాంగణంలో, పరిసరప్రాంతాలలో విస్తారమైన తోటలు కలవు. మొదటి కులోత్తుంగ చోడుని కాలములో వేయించిన ఒక శాసనము ద్వారా ఆనాటి తోటల వివరాలు ఇలా తెలుస్తున్నాయి. 1. అనంతరాముని తోట 2. రెండువేల పోక చెట్లు కలిగిన ఎరియనాయకుని తోట 3. ప్రోలిసెట్టి తొండగట్టయ తోట 4. ఆలయమునకు దక్షిణమువైపున సోమానాద్రి పెమ్మాడి ఆండర్ తోట 5. తూర్పువైపున తొండకొరడియ తోట[46]

****

దేవాలయములో దేవుని ఎదుట ఎల్లప్పుడు వెలుగుతూ ఉండే దీపమును అఖండదీపము అంటారు. ఇది హైందవ సాంప్రదాయము. ఏ కారణంచేతయిన ఆ అఖండజ్యోతి ఆరిపోయినట్లయితే అరిష్టం జరుగుతుందని ఈనాటికీ హిందువుల విశ్వాసం. దేవునివద్ద వెలిగే అఖండదీప నిర్వహణ కొరకు నేయిని వినియోగిస్తారు. ఈ నేయిని నిరంతరం అందించటానికి భక్తులు పాడిపశువులను దానంగా ఇచ్చేవారు. ఈ పశువులలో ఆవులు, గేదెలు, గొర్రెలు కూడా ఉండటం గమనార్హం[47]. ఒక అఖండదీపాన్ని ఆచంద్రతారార్కం ఏర్పాటుచేయటానికి సుమారు 50 ఆవులు అవసరపడతాయని వివిధశాసనాలద్వారా అర్థమౌతుంది. అఖండదీప నిర్వహణకు, క్షీరాభిషేకానికి, ప్రసాదాల తయారీకి, వివిధ సత్రాలలో వినియోగం కొరకు భక్తులు విరివిగా పాడిపశువులను సమర్పించుకొనేవారు. పదకొండు నుంచి పదిహేనో శతాబ్దం మధ్య సుమారు పన్నెండువేల పాడిపశువులను ఆలయానికి భక్తులు సమర్పించుకొన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తున్నది.

ఆలయ అవసరాలకొరకు ధనాన్ని నేరుగా కానుకలుగా భక్తులు 1093 న
సమర్పించుకొన్నట్లు 29 శాసనాలలో కన్పిస్తుంది.

కొంతమంది భక్తులు ఏదైనా ఒక గ్రామానికి సంబంధించిన ఆదాయాన్ని కొంతమొత్తం రాజు గారికి చెల్లించి కొనుక్కొని ఆ గ్రామ ఆదాయాన్ని స్వామివారికి సమర్పించుకోవటం జరిగేది. క్రీశ 1123 లో సింగ్గలభండార అనే వ్యక్తి వేల్పూరు వద్దకల దేవదాన అనే గ్రామ రెట్టడికమును (గ్రామ యజమాన్యం) పరాంతకదేవ

---

46. SII Vol IV - 1114

47. మరిన్ని వివరములు పుస్తకంచివరలో ఉన్న ఇనుపఎడ్లు వ్యాసంలో కలవు

చక్రవర్తి నుండి 30 మాడలకు ఖరీదు చేసి భీమేశ్వర స్వామికి అర్పితము చేస్తూ ఇకపై ఆ గ్రామమునుండి వచ్చే పన్నుల ఆదాయాన్ని మునులు మరియు బ్రాహ్మణుల భోజనము కొరకు, కుమ్మరులకు, సత్రానికి వంటచెరకు తెచ్చే కూలీలకు వినియోగించాలని శాసనం వేయించాడు[48].

క్రీశ. 1153 కు చెందిన మరోశాసనంలో వేయయాజుల కొడుకు యజ్ఞమూర్తి రెట్టడికము (యాజమాన్యం) అనుభవిస్తూ ఉన్న భూమిని ఉలగుయ్యవాండ పెర్మాడికి 122 మాడలకు అమ్మినట్లు ఒక శ్రవనపత్రము (క్రియదస్తావేజు) ఓ శాసనములో ఉన్నది[49]. ఆయన ఆ భూమిని తిరిగి భీమేశ్వర స్వామికి చందనసేవలకొరకు సమర్పించుకొన్నాడు[49].

చోడబల్లిరాజు అతని సోదరుడు తమ తల్లిదండ్రులకు శుభం కలగాలని ఆలయజీర్ణోద్ధరణ నిమిత్తం 45 మాడల రొక్కం క్రిశ. 1122 భీమేశ్వర దేవరకు సమర్పించుకొన్నారు.

ఆలయఖజానాలో కొంతమొత్తమును జమచేసి (సన్నిష్కము) దానిపై వచ్చే వడ్డీతో (మహానిష్కలు) భక్తులు కోరినవిధంగా జరిపించటానికి ఏర్పాట్లు ఉండేవి. ఒక శాసనములో[50] ఆలయ ఖజానాకు 5 మాడలు సమర్పించి, రోజుకు రెండు గిద్దల గంధం చొప్పున స్వామి వారికి ఆచంద్రతారార్కం నివేదించాలని ఉన్నది.

ధనమే కాక అనేక మంది భక్తులు స్వర్ణ ఆభరణములు, పూజా పాత్రలు, వంట పాత్రలు, లోహ దర్పణములు, స్వర్ణ చామరములు, మకరతోరణములు, ఉత్సవవిగ్రహాలు, గంటలు, ఆలయగజరాజుకు అలంకరణ మువ్వలు, పట్టుచీరలు, దీపపుసెమ్మెలు, కాగడాలు లాంటి వివిధ వస్తువులను సమర్పించుకొనేవారు.

****

ప్రాచీన కాలంలో దేవాలయం అనేది సమాజంలో Money Circulate చేసే ఆర్థికకేంద్రం. సమాజం చేసిన ఉత్పత్తిని దానాల రూపంలో స్వీకరించి తిరిగి మరలా సమాజంలోకే సర్క్యులేట్ చేయటానికి ఆలయాలు అప్పట్లో ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. ఆలయాలు గ్రామీణ ఎకానమీని అర్బన ఎకానమీని

---

48. SII Vol IV - 1248 49. SII Vol IV - 1186 50. SII Vol IV - 1093

అనుసంధానం చేసేవి. దేవుని పేరుమీద జరిగే ఈ తతంగంలో అప్పటి సమాజంలోని దాదాపు అన్ని సామాజిక వర్గాలకు ఏదోఒక పాత్ర ఇవ్వబడింది. అప్పటి అప్పటిసమాజంలో అంత్యజులుగా చూడబడ్డ పంచమవర్ణానికి చెందిన వ్యక్తులకు కూడా – రాత్రిపూట ఆలయాన్ని కాపలాకాయటం, దేవాలయగోపురాలపై వాలి మాంసఖండాలను ఆలయప్రాంగణంలోకి జారవిడిచే గద్దలు, రాబందుల వంటి పక్షులను చెదరగొట్టటంలాంటి పనులు ఇచ్చి తనలో ఇముడ్చుకొంది[51] ఆనాటి ఆలయవ్యవస్థ. ఈ పాత్రల్లో ఎక్కువతక్కువలు ఉండటమనేది కాదనలేని సత్యం. అది వేరే చర్చ. ఒక రాజ్యంపై శత్రురాజులు దండెత్తినపుడు ఆ రాజ్య ఆర్ధిక కేంద్రాలయిన ఆలయాలను ధ్వంసం చేయటం ద్వారా తమ విజయాన్ని స్థిరపరచుకొనేవారు.

****

ఇతర గ్రామాల శాసనాలు

మెకంజీ సేకరించిన తూర్పుగోదావరి జిల్లా శాసనాలలో ద్రాక్షారామం తరువాత కోరుకొండ, సర్పవరం, పిఠాపురం, బిక్కవోలు, అనపర్తి గ్రామాలకు రాజమహేంద్రవరం పట్టణానికి చెందిన శాసనాలు యాభై వరకు కలవు. ఇవి ఎక్కువగా దానాలకు సంబంధించినవి. వీటిలో రెండు శాసనాలు చారిత్రికంగా విలువైనవి.

రాజమండ్రి సివిల్ జడ్జి గారైన శ్రీ ఆసిస్ట్యూ దొరగారి ఇంటి గుమ్మంలోపల ఉత్తరం వైపున పాతి ఉన్న శాసనాన్ని మెకంజి అనుచరులు గుర్తించి దాని నకలు తీసారు. గణపతిదేవుడు క్రీశ 1247 లో మహాదేవరాజు పేరున గజ్జరాన (రాజమండ్రి సమీప గ్రామం గజ్జరం) ఒక విగ్రహప్రతిష్టగావించి, ఆ ఆలయ అంగరంగ భోగాల కొరకు అంగడి సుంకాలలో మార్పులు తెస్తున్నట్లు వేయించిన శాసనము ఇది.

అదే విధంగా పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయంలో నలుపలకలుగా సుమారు పన్నెండు అడుగుల స్తంబంలా ఉండే శాసనం ఆంధ్రప్రాంత రాజుల వంశావళిని నిర్మించటానికి ఆధారమైంది. మూడవ

---

51. చామర్లకోట కైఫియ్యతు

గొంకరాజు భార్య, పృధ్వీశ్వర మహారాజు తల్లి అయిన జయాంబిక నవకండవాడ అనే గ్రామాన్ని నిత్యదీపారాధనకొరకు కుంతీమాధవ స్వామికి సమర్పించుకొన్న సందర్భంగా ఇది క్రీశ. 1186లో వ్రాయించిన శాసనము. ఈ శాసనంలో సుమారు పాతికమంది రాజుల వంశ కాలక్రమణిక లిఖించబడింది.

సాధారణంగా దానశాసనాల చివరలో అతిక్రమణలకు పాల్పడినవారు, బ్రాహ్మణ హత్య, తల్లి హత్య, గోహత్య చేస్తే వచ్చేలాంటి పాపం మూటకట్టుకొని నరకానికి పోతారంటూ వివిధ రకాల శాపాలు ఉంటాయి.

ఈ శాసనంలో “దానం శత్రువు చేసినదైనప్పటికీ అది రక్షింపబడాలి. ఎందుకంటే శత్రువు శత్రువే కావచ్చు, కానీ దానం శత్రువు కాదు” అనే గొప్ప వాక్యం ఆకర్షిస్తుంది.

****

మెకంజీ సేకరించిన ద్రాక్షారామ శాసనాలపై Pro.Y.V. Ramana వ్రాసిన Draksharama Inscriptions అనే పుస్తకంలో మెకంజీ 209 ద్రాక్షారామశాసనాలు సేకరించాడని, Archaelogical Survey of India వారు మొత్తం 382 ద్రాక్షారామ శాసనాలను గుర్తించారని అన్నారు, ఈ రెండిటిలో ఉమ్మడిగా 42 మాత్రమే ఉన్నాయి. ఇది ఆశ్చర్యం కలిగించే అంశం. మెకంజీ అనుచరులు శాసన ప్రతులు తీసే సమయానికి, ఆర్కియలాజికల్ సర్వే వారు తీయటానికి మధ్య సుమారు ఎనభై ఏండ్ల వ్యత్యాసం ఉంది. ఈ కాలంలో కొన్ని శాసనాలు పోయి ఉండొచ్చు. మెకంజీ ద్రాక్షారామ శాసనాలలో ఎక్కువ భాగం దానాలే. కొన్నైతే ఆలయ గంటలపై ఉన్న శాసనాలకు కూడా ప్రతులు ఉన్నాయి. మెకంజీ సేకరించిన శాసనాలలో ఆనాటి సమాజాన్ని అర్థంచేసుకోవటానికి దోహదపడే కొన్ని శాసనాలు ఇవి.

క్రీశ.1399 లో కలింగిరి వీరన్న తమ తల్లిదండ్రులకు పుణ్యలోకాలు గలుగగాను తమకు కందాళం వారి చాత క్రయలబ్దమయిన గ్రామం కూచిన పెద్దాద భీమేశ్వరదేవరకు సమర్పణ చేసెను. ఇక్కడ క్రయలబ్దమైన అన్న పదం ఆకర్షిస్తుంది. ప్రైవేటు వ్యక్తులు అప్పట్లో మాన్యాలుగా పొందిన గ్రామాల హక్కులను క్రయవిక్రయాలు చేసుకొనేవారని అర్థమౌతుంది. (మెకంజీ శాసనం నెం. 9)

మండూరి కుప్పనాయుని సమక్షంలో రామచంద్రులు గంగయ్య వృత్తిని,

పెన్నాడ అయ్యల వృత్తిని క్రయముగా పుచ్చుకొని ఒక భక్తుడు భీమేశ్వర మహాదేవరకు సమర్పించుకొన్నాడు. ఇక్కడ వృత్తి అంటే వృత్తి మాన్యం (పని చేస్తున్నందుకు బ్రతకటానికని ఇచ్చే భూమి) కావొచ్చు. (మెకంజీ శాసనం నెం. 46)

మెకంజీ 161 వ నంబరు శాసనములో "మేము, మా వారసులు పరాంతక దేవునికి తప్ప అన్యులకు సేవచేయము అని, అలాచేస్తే అది మా భార్యలను ఇతరుల పరం చేయటంతో సమానమని" రాపర్తి వర్గీయులు చేసిన ప్రమాణ శాసనమొకటి ఆసక్తి కలిగిస్తుంది. దీన్ని లిఖించినది స్థానికంగా ఉండే లేఖరి కాదు. రాజేంద్ర చోడ ఆచార్య అనే పేరు కనిపిస్తుంది. బహుసా ఈ రాపర్తి వారు పరాంతకదేవుని సమక్షంలో చేసుకొన్న సంధి ఒప్పందం సారంసం కావొచ్చు ఈ శాసనం. దాన్ని తీసుకొచ్చి ఆలయంలో నాటటం బహుసా ఆనాటి రాజకీయ ఎత్తుగడ అనుకోవాలి.

మెకంజీ 20 వ నంబరు శాసనంలో ఆలయ పడమటి సత్రములో ఉండే పరదేశి తపస్సులకు, క్రీ శ 1154 లో గుడివాడము దానంగా ఇవ్వబడినట్లు ఉంది. ఎవరీ పరదేశి తపస్సులు అన్న కుతూహలం కలిగకమానదు.

క్రీశ 1434 నాటి ఒక శాసనములో "సప్తగోదావరి" తీర ద్రాక్షారమ పురం" అనే పదం కొత్తగా కనిపిస్తుంది. అంతవరకూ గోదావరిని గుద్దవాడి, గుద్రవర లాంటి పేర్లతో వ్యవహరించబడేది.

మెకంజీసేకరించిన తూర్పుగోదావరి శాసనాలను పరిశీలిస్తున్నప్పుడు దేవాలయాల శాసనాలు కాక గోదావరి గట్టున లభించినవి అంటూ కొన్ని, జైలు లోపల నేలపై పడి ఉన్నవి అంటూ మరికొన్ని, పేపర్లు సాపుచేసే రాయిమీద ఉన్న శాసనం అంటూ ఒకటి, అనపర్తి ఊరి మధ్యలో పాతుకుపోయిన శాసనమూ అంటూ మరొకటి ఇలా అనేక శాసనాల పాఠాలు కనిపించాయి. పాపం మెకంజీ అనుచరులు శాసనాల కొరకు అప్పట్లో నేలను దాదాపు జల్లెడ పట్టారని అర్థమౌతుంది. అలా సేకరించిన వాటిలో 42 మాత్రమే ఆర్కియలాజికల్ రికార్డులలోకి ఎక్కాయి. మిగిలినవి వాస్తవరూపంలో ఉన్నవో లేవో!

ఇనుప ఎడ్లు

.

కాలిన్ మెకంజి సేకరణలలో 8076 శాసనాలు ఉన్నట్లు వాటిని కేటలాగ్ చేసిన H H Wilson గుర్తించాడు. వీటిలో ద్రాక్షారామ భీమేశ్వర ఆలయానికి చెందిన 209 శాసనాలు కలవు. పదకొండవ శతాబ్దంనుంచి పదిహేనవ శతాబ్దాంతం వరకూ ఆనాటి రాజులు, అధికారులు, వ్యాపారులు, సామాన్యులు అనేకమంది ఈ ఆలయానికి విశేషమైన దానాలు సమర్పించుకొన్నారు. ఈ దానాలలో భీమేశ్వరుని అఖండ దీపారాధన జరిపించటం కొరకు ఇచ్చిన పశువుల దానాలు అనేకం కలవు.

భీమేశ్వర ఆలయానికి సొంత కిలారము (పశువుల కొట్టాం) ఉండేది. పశువులను సాకటానికి అనేకమంది బోయ వాండ్రు ఉండేవారు. ఆలయానికి దానంగా ఇచ్చిన పశువులను ఈ బోయవాండ్రు మేపుతూ ఆలయ పూజాదికాలకు అవసరమైన దీపారాధనకొరకు నేయి, అభిషేకాలకొరకు పాలను అందించటం వీరి పని. అనేక శాసనాలలో పశువులను ఈ బోయలకు అప్పగించినట్లు ఉంది[1]. ఇక్కడ బోయ అన్నది బహుసా యాదవులయి ఉండవచ్చు. క్రీశ. 1259 నాటి ఒక శాసనములో దేవనబోయ అనే పేరుగలిన వ్యక్తి కులనిధి గోపాన్వయుడుగా (యాదవకులస్థుడు) చెప్పబడ్డాడు[2]. బోయ అనే పదం నేటికీ చాలామంది యాదవకులస్థుల ఇంటిపేర్లలో కనిపిస్తుంది.

ఈ రకపు దానములలో "ఇనుప ఎడ్లు" పేరు ఆసక్తికరంగా అనిపిస్తుంది. ఇది ఆలయంలో నిత్య దీపారాధన జరిపించటానికి ఇచ్చిన దానమని, "పాలు ఇచ్చే పశువులు" అనే అర్థంలో "ఇనపఎడ్లు" అనే పదం వాడబడిందని

---

1. SII Vol IV - 1156 2. SII Vol IV - 1370

అర్థమౌతుంది. ఎడ్లు కి నైఘంటికార్థం ఎద్దులు, ఆవులు లేక గొర్రెలు (తెలుగు వ్యుత్పత్తి కోశం 1978 –ఆంధ్రభారతి). నేడు ఎడ్లు అంటే అంటే ఎద్దులు అనే అర్థమే జనసామాన్యంలో స్థిరపడింది. "ఇనుప ఎడ్లు" పదం వాడిక నేడు వింతగా అనిపించక మానదు.

****

ద్రాక్షారామ భీమేశ్వరునికి అఖండదీపారాధన, అభిషేకాలకొరకు సమర్పించుకొన్న వివిధరకాల పశువుల సంఖ్య వివిధ శతాబ్దాలలో ఒక్కో విధంగా ఉంది. 11 వ శతాబ్దంలో వేయి పశువులను దానం ఇవ్వగా, ఇది 12 వ శతాబ్దంలో ఈ 9470 గాను (వెలనాటి చోళుల పాలన), 13 వ శతాబ్దానికి ఇది 1105 గానూ ఉండటం గమనార్హం. 14, 15 శతాబ్దాలకు సంబంధించి దానం చేయబడిన పశువుల సంఖ్య 50 మరియు 221 కావటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆ తరువాతి శతాబ్దాలలో అలాంటి దానాలకు సంబంధించిన వివరాలు లేవు. ఈ మార్పులు ఆనాటి పాలకుల రాజకీయ ప్రాధాన్యతలను లేదా ఒడిదుడుకులను సూచిస్తాయి. ఈ లెక్కలు తగ్గిన Temple Patronage ను ప్రతిబింబిస్తాయి.

ఆలయంలో స్థానికంగా కొంతమంది యాదవులు ఉంటూ భక్తులు ఇచ్చే ఈ పశువుల దానాలను స్వీకరించేవారు. వాటి నిర్వహణా బాధ్యతను మరొకరికి అప్పగించవలసి వచ్చినప్పుడు, స్థానిక యాదవులు హామీ ఇచ్చి ఆ పశువులను బయటవ్యక్తులకు అప్పగించినట్లు కూడా కొన్ని శాసనముల ద్వారా తెలుస్తున్నది.

క్రీశ. 1166 లో చోడమహాదేవి 10 కులోత్తుంగ మాడలతో 50 ఇనుప ఎడ్లను బహుకరించింది. అంటే ఒక మాడ (అర వరహా) అయిదు ఇనుపఎడ్లకు సమాన విలువ అని అర్థమౌతుంది[3].

ఇనుపఎడ్లు అనే పదం "ఆవు" పదానికి ప్రాకృత రూపం అనుకోవటానికి వీల్లేదు. ఎందుకంటే అదే సమయంలో ఆవులను మొదవులని (మొదవు=పాడియావు) పేర్కొంటూ ఉన్న కొన్ని శాసనాలు కలవు. ఒక శాసనములో[4]– ఒక్కెత్తు గండయ సోదరి అయిన మేడసాని అనే ఆమె ద్రాక్షారామ

3. SII Vol IV - 1052

4. SII Vol IV - 1158

1158 నంబరు

భీమేశ్వర దేవరకు అఖండ దీపారాధన నిమిత్తము "మొదవులు" (ఆవులు) దానం ఇచ్చినట్లు స్పష్టంగా ఉన్నది.

అదే విధంగా మొదటి కులోత్తుంగుని పాలనాకాలంలో చేసిన ఒక శాసనములో, ఒక మణుగు నెయ్యిని (సుమారు 11 కేజీలు) ఇచ్చేలాగ 35 "సురభిలు" (ఆవులు) దానం ఇచ్చినట్లు తెలుస్తున్నది[5].

శాసనాలలో చెప్పిన ఇనుపఎడ్లను నిఘంటువులో చెప్పిన విధంగా గొర్రెలు అనుకోవటానికి కూడా వీలుచిక్కదు, ఎందుకంటే కొన్ని శాసనాలలో గొర్రెలను "గొరియలని" పేర్కొనటం జరిగింది. క్రీశ 1038 నాటి శాసనములో క్షేత్రపాలకుని సంధ్యదివ్వెల కొరకు ఒక మానిక (సుమారు లీటరు) నెయ్యి ఇచ్చేలాగ 50 గొఱియలు, అర మానిక నెయ్యి ఇచ్చేలాగ 25 గొఱియలు దానంగా ఇవ్వబడ్డాయి[6].

క్రీశ. 1084 లో వేసిన ఒక శాసనములో ఆలయములో ఉన్న కులోత్తుంగ సత్రమునకు ముప్పది పుట్ల భూమి (ఒక గరిసె లేదా 60 ఎకరములు) దానముతో పాటు 300 యెడ్లను కూడా దానం ఇచ్చినట్లు ఉంది[7]. 300 ఎడ్లు అనేది చాలా పెద్ద సంఖ్య. ఇది అరవై ఎకరముల పంట భూమితో పాటు ఇస్తున్న దానం కనుక ఆ భూమిని సాగుచేయటానికి అవసరపడే ఎద్దులుని ఊహించాలి. ఆ నేలను సాగుచేయగా వచ్చిన ఫలధాన్యాలను సత్రంలో భోజనాదులకు వినియోగించేవారని అనుకోవాలి. దీనిని బట్టి "ఎడ్లు" అనే పదం వాడిక నేటిలాగే అప్పట్లోకూడా ఉందనే భావించాలి.

****

28 మార్చ్, 2018 ఆంధ్రభూమి పత్రికలో "తెలుగు భాషకిదో ప్రాకృతిక బాంధవ్యం" అనే వ్యాసంలో శ్రీచీమకుర్తి శేషగిరి రావు "ఇనపఎడ్లు" అన్న పదానికి దేవర ఆంబోతులు/దేవరెద్దులు అన్న అర్ధం చెప్పారు. కానీ ఈ పదానికి ఆ అర్ధం అనుకూలించదు. ఎందుకంటే......

ఇనుపఎడ్ల సంఖ్య దాదాపు అన్ని శాసనాలలోను 25 నుంచి 50 వరకూ ఉండటాన్ని గమనించవచ్చు. ఇనుప ఎడ్లకు "దేవర ఆంబోతు" అన్న అర్ధం తీసుకొన్నప్పుడు అంత పెద్ద సంఖ్యలలో ఆంబోతులను దానం చేయటం జరగదు. అప్పట్లో వ్యవసాయానికి ఎద్దుల అవసరం ఎక్కువ. కనుక ఊరికి రెండో మూడో

5. SII Vol IV - 1288 6. SII Vol IV - 1014 7. SII Vol IV - 1015

దేవర ఆంబోతులును అంకితమిచ్చే అవకాశం ఉంటుంది తప్ప ఇంత భారీ సంఖ్యలలో ఆంబోతులను ఇవ్వటానికి వీలుపడకపోవచ్చు.

అనేక శాసనాలలో భీమేశ్వరుని "దీపారాధన" కొరకు ఇనుపఎడ్లను దానం చేస్తున్నట్లు స్పష్టంగా ఉంది. రెండవ గొంకరాజు వద్ద ప్రధాని, సమస్త సేనాధిపతిగా పనిచేసిన వాసనపెగ్గడ కూతురు గుండమ భీమేశ్వరునికి "అఖండదీప నిర్వహణ" కొరకు 50 ఇనపఎడ్లను దానం ఇచ్చినట్లు ఆమె వేయించిన శాసనంలో స్పష్టంగా ఉంది[8]. ఈ అవసరం దృష్ట్యా ఇనుపఎడ్లు అన్న పదానికి ఆంబోతులు అన్న అర్ధం పొసగదు.

****

ఇనుప ఎడ్లు అంటే గేదెలా లేక మేకలా?

ఈ శాసనాలను పరిశీలించగా ఎద్దులు, ఆవులు, గొర్రెలు లాంటి పశువులను సూచించటానికి అప్పటికే స్పష్టమైన పదాలు ఉండినట్లు అర్ధమౌతుంది.

ఇనుప ఎడ్లు అన్నపదానికి అర్ధం ఆంబోతులు, ఎద్దులు, ఆవులు, గొర్రెలు కాదు అనుకొంటే పాలు ఇచ్చేపశువులలో బర్రెలు, మేకలు మిగులుతాయి. ఇనుపఎడ్లు శబ్దానికి ఇంతవరకూ వివిధ ప్రముఖులు ఇచ్చిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

ఆంధ్రశబ్దరత్నాకరములో "ఈన్పయెడ్లు" అనే పదానికి ఆడుమేకలు అనే అర్ధం ఉన్నది. "ఈన్ప" ఈనుప అనే పదానికి హ్రస్వరూపమనుకొంటే దానికి "ఈనగలిగే" అనే అర్ధం చెప్పుకొనవచ్చును. ఈ వ్యుత్పత్తి ప్రకారం ఇనుపఎడ్లు అంటే మేకలు అని చెప్పబడ్డాయి

ఇనుపఎడ్లు అంటే నల్లని పశువులు. ఇనుము నల్లగా ఉంటుంది కనుక ఆ పేరు అలా వచ్చిందని శ్రీ బులుసు వెంకట రమణయ్య 1937 జూలై, భారతి పత్రికలో వ్రాసిన ఒక వ్యాసంలో అభిప్రాయపడ్డారు.

శ్రీ ఈశ్వరదత్తు సంకలనపరచిన "శాసన శబ్దకోశము" లో ఇనుపఎడ్లు అంటే మేకలు, గొర్రెలు అనే అర్ధం ఇచ్చారు (పే. 77)

శ్రీ నార్ల వెంకటేశ్వరరావు సంపాదకత్వంలో వచ్చిన "పదబంధ

8. SII Vol IV - 1089

పారిజాతము" అనే నిఘంటువులో 158 పేజీలో "ఇనుపయెడ్లు- ఎనుములు, గేదెలు, దున్నలు శాసనపరిభాష. ఎనపగొడ్లు అని రాయలసీమలో నేటివాడుక" అని ఉన్నది.

తెలుగులో ఎనుములు అంటే గేదెలు. ఎనుము రూపాంతరమే ఇనుపఎడ్లు అనే పదం. ఆవిధంగా ఇనుపఎడ్లు అంటే గేదెలు అని శ్రీ బూదిరాజు రాధాకృష్ణ "ప్రాచీనాంధ్ర శాసనములు" పుస్తకంలో అన్నారు (పే. 231).

ఈ క్రింది శాసనముల జాగ్రత్తగా పరిశీలించినపుడు ఇనప ఎడ్లుగా చెప్పబడినవి గేదెలా లేక మేకలా అనే అంశాన్ని నిర్ణయించవచ్చును.

1068 నంబరు కల శాసనములో 5 ఆలయ దీపాల నిర్వహణకు 250 "ఇనుపఎడ్లు" ఇవ్వబడినట్లు ఉంది.

1158 నంబరు కల శాసనములో 2 ఆలయ దీపాల నిర్వహణ కొరకు ఒక్కింటికి 50 "ఆవుల" చొప్పున దానం చేసినట్లు ఉన్నది.

పై రెండు శాసనములను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఒక అఖండదీపమును ఏర్పాటు చేయటానికి 50 ఆవులు కానీ 50 ఇనుపఎడ్లు కానీ అవసరపడుతున్నట్లు అవగతమౌతుంది. ఆవులతో సమానంగా పాలు ఇచ్చే పశువులు గేదెలు అవుతాయి తప్ప మేకలు అయ్యే అవకాసం లేదు. ఆ లెక్కన "ఇనుపఎడ్లు" అనే పదం "ప్రాచీనాంధ్ర శాసనములు", "పదబంధ పారిజాతము" పుస్తకములలో చెప్పినట్లు ఎనుములు లేదా గేదెలు అన్న అర్ధంలోనే వాడబడిందని నిర్ధారణ చేయవచ్చును.

****

ఉపసంహారం

నేటి సమాజంలో దేవునిపూజకు ఆవుపాలు, ఆవునెయ్యి తప్ప ఇతరజీవుల ఉత్పత్తులను వినియోగించరు. అలాచేయటం అపవిత్ర చర్యగా కూడా భావిస్తారు. కానీ సుమారు వెయ్యేళ్ల క్రితం గేదెల, గొర్రెల ఉత్పత్తులను దేవతార్చనకు వాడటం పట్ల ఏ రకమైన అభ్యంతరం లేదని పై శాసనాల ద్వారా తెలుస్తుంది.

సమకాలీనంగా ఆవుకు ఎనలేని పవిత్రత ఆపాదించటం జరిగింది. గోమూత్రం ఒక సర్వరోగనివారిణిలాగ ప్రచారించటం కూడా చూస్తున్నాం. వెయ్యేళ్ళ క్రితంనాటి సమాజం గోవును ఇతరపశువులతో సమానంగా చూసింది తప్ప ఏ

రకమైన ప్రత్యేకతను ఇచ్చినట్లు ద్రాక్షారామ ఆలయ శాసనాలలో కనిపించదు.

బౌద్ధ జైనాల వైపు మళ్లిన ప్రజలను వెనక్కి లాక్కోవటానికి వైదిక ధర్మం అహింసను విడనాడి, సాత్వికమైంది. ఈ క్రమంలో గోవుకు పవిత్రత వచ్చిచేరింది. పన్నెండో శతాబ్దంలో మూడవ కులోత్తుంగచోళుడు తొలిసారిగా ఆలయాలలో గోశాలలు నిర్మాణం చేసినట్లు తెలుస్తుంది.

వైదిక క్రతువులలో సాగించిన గోవధ [9] నుండి క్రమక్రమంగా దేవతలకు బర్రెలను, గొర్రెలను బలులుగా ఇవ్వటం వరకూ హిందూ సమాజం సాగించిన ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు కనిపిస్తాయి. ఒకప్పుడు ఆవులతో సమాన హెూదా కలిగిన బర్రెలు, గొర్రెలు కాలక్రమేణా పవిత్రతను పొందలేకపోవటమే హిందూదేశ చరిత్ర.

9. The Myth of Holy cow, by D.N. Jha p.n 30